ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
కడప
జిల్లా వార్తలు
శుక్రవారం 15 మార్చి 2024


మీడియాతో మాట్లాడుతున్న మాధవీరెడ్డి

బరిలో వరద, చైతన్య



ప్రొద్దుటూరు

పేరు	: నంద్యాల వరదరాజులరెడ్డి
విద్యార్హత	: ఎస్ఎస్ఎల్‌సీ
స్వగ్రామం	: కామనూరు, ప్రొద్దుటూరు మండలం
తల్లిదండ్రులు	: సుమిత్రాదేవి, పెద్ద వరదారెడ్డి
కుమారుడు	: నంద్యాల కొండారెడ్డి

సమన్వయంతో పని చేస్తా..

ప్రొద్దుటూరు ప్రజల మద్దతుతో టీడీపీ టికెట్టు దక్కింది. వచ్చే ఎన్నికల్లో వైసీపీ అరాచకపాలనకు ప్రొద్దుటూరులో చరమగీతం పాడుతాం. గెలుపు కోసం అందరినీ కలుపుకుని సమన్వయంతో పనిచేస్తా. రెండురోజుల్లో చంద్రబాబు, లోకేశ్‌లను కలిసి వచ్చాక.. స్థానికంగా ఉన్న టీడీపీ ముఖ్యనేతలందరితో చర్చించి ఉమ్మడిగా కలిసి కట్టుగా ప్రచారం సాగిస్తాం. పొత్తులో ఉన్న జనసేన బీజేపీ నాయకులను కూడా సమన్వయం చేసుకుని ముందుకు సాగుతాం.

- మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, ప్రొద్దుటూరు టీడీపీ అభ్యర్థి

- టీడీపీ రెండో జాబితా విడుదల
- ప్రొద్దుటూరు నుంచి మరోసారి వరదరాజులరెడ్డి
- కమలాపురం నుంచి తొలిసారిగా పుత్తా చైతన్యరెడ్డి
- జమ్మలమడుగు, బద్వేలు బీజేపీకే



తెలుగుదేశం పార్టీ రెండో జాబితాను విడుదల చేసింది. ప్రొద్దుటూరు టీడీపీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డినే ఎంపిక చేసింది. ఇక కమలాపురం నుంచి యువ నేత పుత్తా చైతన్యరెడ్డిని బరిలో దింపింది. ఇప్పటికే తొలివిడతలో కడప, మైదుకూరు, పులివెందుల అభ్యర్థులను ప్రకటించింది. ఇక పొత్తుల్లో భాగంగా జమ్మలమడుగు, బద్వేలు స్థానాలను బీజేపీకి కేటాయించారు. కడప పార్లమెంటులో అసెంబ్లీ స్థానాలకు టీడీపీ అభ్యర్థులంతా ఖరారు అయ్యారు. ఇక పార్లమెంటు అభ్యర్థిని మాత్రమే ప్రకటించాల్సి ఉంది. అసెంబ్లీ స్థానాలన్నీ ప్రకటించి సైకిలు దూసుకెళుతోంది. టీడీపీలో తొలిసారిగా కడప నుంచి ఆర్.మాధవీరెడ్డి, కమలాపురం నుంచి పుత్తా చైతన్యరెడ్డి బరిలో నిలవనున్నారు.

(కడప-ఆంధ్రజ్యోతి): రానున్న సార్వత్రిక ఎన్నికలను టీడీపీ చాలా ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. గెలుపే లక్ష్యంగా అభ్యర్థులకు సంబంధించి పలు రూపాల్లో సర్వే నిర్వహించి ఎంపిక చేసింది. ప్రొద్దుటూరు టీడీపీ టికెట్ కోసం మాజీ ఎమ్మెల్యేలు వరదరాజులరెడ్డి, లింగారెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, సీఎం సురేశ్‌నాయుడు పోటీ పడ్డారు. చివరికి సర్వేలో మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డికే రావడంతో ఆయనను ఎంపిక చేశారు. కమలాపురం నుంచి టీడీపీ ఇన్‌చార్జి పుత్తా నరసింహారెడ్డి కుమారుడు చైతన్యరెడ్డి తొలిసారిగా బరిలో నిలవ నున్నారు.

రౌడీ రాజకీయాలకు ఎదురొడ్డిన వరద

ప్రొద్దుటూరు నియోజకవర్గంపై మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత టీడీపీ అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డి తన మార్కు చూపించారు. ఇక్కడ నుంచి ఆయన వరుసగా ఐదుసార్లు గెలుపొందారు. 1983లో తొలిసారి టీడీపీ నుంచి పోటీచేసి గెలుపొందారు. 1989, 94, 99, 2004 ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి గెలుపొందారు. 2014లో టీడీపీ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. ప్రొద్దుటూరు మండలంలోని కామనూరుకు చెందిన వరదరాజులరెడ్డి 1981లో రాజకీయాల్లోకి వచ్చారు. ప్రొద్దుటూరులో ఫ్యాక్షన్ రౌడీరాజకీయాలను సమర్థవంతంగా ఎదుర్కొని వరుసగా గెలుస్తూ వచ్చారు. సాధారణ జీవితం గడుపుతూ అందరికీ అందుబాటులో ఉంటారనే పేరుంది.

జమ్మలమడుగు, బద్వేలులో బీజేపీ పోటీ

పొత్తులో భాగంగా జమ్మలమడుగు, బద్వేలు నియోజకవర్గాల బరిలో బీజేపీ అభ్యర్థులు నిలబడనున్నారు. జమ్మలమడుగు నుంచి టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి, బద్వేలు నుంచి బొజ్జ రోశన్న టికెట్ ఆశిస్తూ వచ్చారు. అయితే పొత్తులో భాగంగా ఇక్కడ బీజేపీకి కేటాయించారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు జమ్మలమడుగు ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శివనాథరెడ్డి, బద్వేలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, రితీశ్‌రెడ్డి, బొజ్జరోశన్నలను విజయవాడకు పిలిపించుకుని మాట్లాడారు. జమ్మలమడుగు, బద్వేలు బీజేపీకి కేటాయించామని అక్కడ ఆ పార్టీ గెలుపుకోసం పనిచేయాలని నచ్చచెప్పారు. జమ్మలమడుగు నుంచి బీజేపీ అభ్యర్థిగా మాజీమంత్రి ఆదినారాయణరెడ్డి పోటీ చేయనున్నారు. బద్వేలు నుంచి కొన్ని పేర్లు వినిపిస్తున్నాయి.



కమలాపురం

పేరు	: పుత్తా చైతన్యరెడ్డి
విద్యార్హత	: ఎంబీఏ
స్వగ్రామం	: మాచిరెడ్డిపల్లె, వల్లూరు మండలం
తల్లితండ్రులు	: పుత్తా సరళమ్మ, పుత్తా నరసింహారెడ్డి
భార్య	: చైతన్య
కుమారుడు	: వివన్ నరసింహారెడ్డి
కుమార్తె	: ఆద్య

మా తండ్రికే అవకాశమివ్వండి : చైతన్య

కమలాపురం అభ్యర్థిగా పుత్తా చైతన్యరెడ్డిని టీడీపీ ప్రకటించింది. అయితే ఈసారి ఎన్నికల్లో తన తండ్రి పుత్తా నరసింహారెడ్డికే అవకాశం ఇవ్వాలని పుత్తా చైతన్యరెడ్డి గురువారం హైదరాబాదులో లోకేశ్‌ను కలిసి అడిగినట్లు సమాచారం. టీడీపీ కేడరు నరసింహారెడ్డి నాయకత్వాన్ని కావాలని కోరుకుంటోందని ఆయన అన్నట్లు తెలిసింది.

టీడీపీ పోస్టర్లకు సున్నం

- కార్పొరేషన్ సిబ్బంది నిర్వాకం
- అడ్డుకున్న టీడీపీ కార్యకర్తలు, అభిమానులు
- ఎన్నికల కోడ్ రాకముందే కడపలో కోడ్ వచ్చిందా?
- ఆగ్రహం వ్యక్తం చేసిన టీడీపీ కడప అభ్యర్థి మాధవీరెడ్డి

కడప (క్రైం), మార్చి 14 : కడప నగరంలోని 5వ డివిజన్ అశోక్‌నగర్‌లో గురువారం కార్పొరేషన్ సిబ్బంది టీడీపీ పోస్టర్లను చించివేసి సున్నం పూస్తుండగా స్థానిక టీడీపీ కార్యకర్తలు, అభిమానులు అడ్డుకున్నారు. దీంతో కార్పొరేషన్ సిబ్బందికి స్థానికులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న కడప టీడీపీ అభ్యర్థి ఆర్.మాధవీరెడ్డి అక్కడికి చేరుకున్నారు. టీడీపీ పోస్టర్లను చించివేయడం, వాటిపై సున్నాలు పూయడంతో ఆందోళన వ్యక్తం చేశారు. అశోక్‌నగర్‌లో టీడీపీ కార్యకర్త ఓబులేసు ఇంటిపై ఉన్న పోస్టర్లకు కూడా పెయింటు పూస్తుండడంతో ఆ యువకుడు అడ్డుకున్నాడు. అక్కడికి చేరుకున్న మాధవీరెడ్డి కార్పొరేషన్ సిబ్బంది తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యకర్తలతో కలసి ఆమె ఆందోళనకు దిగారు. కడప డీఎస్పీ షరీఫ్, చిన్నచౌకు సీఐ నరసింహారెడ్డి, ఎస్ఐ రవికుమార్ అక్కడికి చేరుకున్నారు. మాధవీరెడ్డి మాట్లాడుతూ ఏపీలో ఎన్నికల కోడ్ రాక ముందే కడపకు మాత్రమే వచ్చినట్లు టీడీపీ పోస్టర్లు చించడం, సున్నం వేయడం చేస్తున్నారని అన్నారు. టీడీపీ బ్యానర్లు, పోస్టర్లతో ప్రచారానికి మున్సిపల్ కార్పొరేషన్‌కు డబ్బులు చెల్లించామన్నారు. అయినా మున్సిపల్ కమిషనర్, డిప్యూటీ సీఎం అంజద్‌బాషా ప్రోద్బలంతో సచివాలయ సిబ్బంది, కార్పొరేషన్ సిబ్బంది తమ పోస్టర్లకు సున్నం పూశారని అన్నారు. వైసీపీ వారు మాత్రం ఎక్కడ పడితే అక్కడ బ్యానర్లు వేసుకోవచ్చు. స్టిక్కర్లు అంటించినా వాటిని మాత్రం తొలగించలేదన్నారు. టీడీపీ బ్యానర్లు కట్టుకుంటే కార్పొరేషన్‌లో పనిచేసే నాగేంద్ర వచ్చి కిందిస్థాయి ఉద్యోగులను బెదిరించి బ్యానర్లను చింపివేయిస్తున్నారన్నారు. చిన్నచౌకు సీఐ నరసింహారెడ్డి తనపై వేలు చూపిస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారని అన్నారు. తాము ఎవరికీ భయపడమని, అధికారులకు జీతాలు వైసీపీ ప్రభుత్వం ఇవ్వలేదని, ప్రజల సొమ్మే ఇస్తున్నారని ఇలా అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరించడం తగదన్నారు. అధికారుల తీరుపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. చివరకు పోలీసులు నచ్చచెప్పడంతో వారు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు 5వ డివిజన్ ఇన్‌చార్జ్ డిష్ సురేశ్, నక్కల శివరాం, శిలాష్ తదితరులు ఉన్నారు.


బీసీ భవన్ ప్రారంభోత్సవంలో రసాభాస

- శిలాఫలకంలో ఎమ్మెల్సీ రమేశ్‌యాదవ్ పేరు లేదని పలువురి ఆగ్రహం

కడప (మారుతీనగర్), మార్చి 14: జిల్లాలోని బీసీల అభివృద్ధి, సంక్షేమం కోసం జిల్లా కేంద్రమైన కడప పాత రిమ్స్‌లో రూ.5.65 కోట్లతో నాలుగు అంతస్తుల బీసీ భవన్ నిర్మాణ పనులు సాగుతున్నాయి. ఇప్పటికైతే పూర్తిస్థాయిలో నిర్మాణం జరగలేదు. అయినప్పటికీ ఎన్నికల కోడ్ రానున్న నేపథ్యంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కొంత మంది అధికార పార్టీకి అనుకూలంగా ఉన్న వారి ప్రోద్బలంతో గురువారం బీసీ భవన్ ప్రారంభోత్సవానికి సిద్ధపడ్డారు. అక్కడ ఏర్పాటు చేసిన శిలాఫలకంలో అధికార పార్టీకి చెందిన ముఖ్య నాయకుల పేర్లు ఉన్నాయి. అందులో ఎమ్మెల్సీ రమేశ్‌యాదవ్ పేరు లేకపోవడంతో యాదవ వర్గానికి చెందినవారు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ఉదయం 8.30కు ప్రారంభోత్సవం కావాల్సిన బీసీభవన్ ఆగింది. చివరకు నాయకుల మధ్య సమన్వయం కుదరడంతో బీసీ భవన్‌ను సాయంత్రం ప్రారంభించారు.

గుట్టుగా ఉపాధ్యాయ బదిలీలు

- దాదాపు 75 మందికి పైగా ఆర్డర్లు
- ఎంఈవోలకు చేరిన ఆదేశాలు



కడప (ఎడ్యుకేషన్), మార్చి 14: జిల్లావిద్యాశాఖలో అనధికారికంగా ఉపాధ్యాయ బదిలీలు జరిగినట్లు పెద్దఎత్తున ప్రచారం జరుగుతోంది. దాదాపు 75 మందికి పైగా ఉపాధ్యాయులకు ఆర్డర్లు విడుదలైనట్లు తెలుస్తోంది. ఉపాధ్యాయులను ఒకచోట నుంచి మరో చోటుకు బదిలీచేసేందుకు వైసీపీ ప్రజాప్రతినిధులు, మంత్రులు భారీ స్థాయిలో సిఫారసులు చేశారు. దీంతో దాదాపు 75 మంది ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించిన ఆర్డర్లు డీఈవో కార్యాలయానికి పంపినట్లు తెలుస్తోంది. అవి ఎంఈవోలకు కూడా చేరినట్లు సమాచారం. జిల్లాలో 60 మంది ఎస్‌జీటీలు, 15మంది స్కూలు అసిస్టెంట్లకు ఆర్డర్లు వచ్చినట్లు సమాచారం.

భారీగా పైరవీలు

ఉపాధ్యాయుల అక్రమ బదిలీల్లో భారీగా పైరవీలు జరిగాయని సమాచారం. ఉపాధ్యాయులు ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీల నుంచి సిఫారసు లెటర్లు తీసుకున్నా.. రాష్ట్ర కార్యాలయంలో భారీగా ముడుపులు చెల్లించాల్సి వస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే జిల్లాకు ఆర్డర్లు వచ్చిన తరువాత ఇక్కడ కూడా కొంత ముట్టచెబుతున్నట్లు సమాచారం. రహస్యంగా చేపట్టిన ఈ అక్రమ బదిలీలపై ఉపాధ్యాయులు మండిపడుతున్నారు. సాధారణ బదిలీలు జరిగే సమయంలో తమకు అన్యాయం జరుగుతుందని వాపోతున్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి ఉపాధ్యాయులకు అన్ని విధాలుగా అన్యాయం జరుగుతోందని వాపోతున్నారు.

ఇచ్చింది రూ.2.79లక్షల కోట్లు..
దోచింది రూ.8.50లక్షల కోట్లు

- జగన్‌పై తులసిరెడ్డి ఆగ్రహం

వేంపల్లె, మార్చి 14: ఐదేళ్ల కాలంలో జగన్ ప్రభుత్వం ప్రజల ఖాతాలలో వేసిన డబ్బు రూ.2.79లక్షలకోట్లు కాగా.. ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రజల నుంచి దోచింది రూ.8.50లక్షలకోట్లు అని మాజీ రాజ్యసభ సభ్యుడు, కాంగ్రెస్ రాష్ట్ర మీడియా చైర్మన్ నర్రెడ్డి తులసిరెడ్డి ధ్వజమెత్తారు. గురువారం వేంపల్లెలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చింది గోరంత లాక్కున్నది కొండంత అన్నారు. ధరలు, పన్నులు, చార్జీలు పెంచడం ద్వారా ఈ ఐదేళ్లలో ప్రజలపై జగన్ ప్రభుత్వం రూ.3లక్షలకోట్లు అదనపు భారం మోపిందన్నారు. మద్యం ధరలు పెంచడం ద్వారా రూ.16వేల కోట్లు, ఇసుక ధర పెంచడం ద్వారా రూ.10వేలకోట్లు, ఆస్తి పన్ను పెంపు ద్వారా రూ.7వేలకోట్లు, విద్యుత్ చార్జీలు పెంచడం ద్వారా రూ.30వేలకోట్లు, పెట్రోల్, డీజిల్ రేట్లు పెంచడం ద్వారా రూ.15వేలకోట్లు ప్రజలపై అదనపు ఆర్థిక భారాన్ని జగన్ ప్రభుత్వం మోపిందన్నారు. అప్పు ద్వారా రూ. 8.50లక్షలకోట్లు, బాదుడు ద్వారా రూ.3లక్షల కోట్లు అన్నారు. ఇందులో ప్రజలకు రూ.2.79లక్షలకోట్లు అని మిగిలిన రూ.8.50లక్షలకోట్లు ఏమైందో ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

వివేకా హత్యకు గుర్రై ఐదేళ్లు

- నేడు కడపలోని జయరాజ్ గార్డెన్స్‌లో ఐదో స్మారకోత్సవ సమావేశం
- వివేకా ఆత్మీయులకు సునీతారెడ్డి ఆహ్వానం
- హాజరు కానున్న వైఎస్ షర్మిలారెడ్డి
- ఆత్మీయ సమావేశంపై సర్వత్రా ఆసక్తి

కడప, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చిన్నాన్న మాజీమంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకు గుర్రై నేటికి ఐదేళ్లు. సరిగ్గా 2019 సార్వత్రిక ఎన్నికల వేళ ఇదే రోజు (మార్చి 15వ తేదీ) తెల్లవారగానే వివేకా గుండెపోటుకు గురయ్యారంటూ జగన్ చానెల్‌లో బ్రేకింగ్ న్యూస్ వచ్చింది. అయ్యో అనుకునే లోపే గుండెపోటు కాదు గొడ్డలితో లేపేశారనే వార్త దావానలంలా వ్యాపించింది. ఇది అప్పట్లో సంచలనంగా మారింది. చంద్రబాబే చంపించారంటూ జగన్ శిబిరం ఆరోపిస్తూ వచ్చింది. అయితే న్యాయం కోసం వివేకా కుమార్తె సునీత సీబీఐని ఆశ్రయించడంతో నాలుగేళ్లకు వివేకా హత్య కేసు గుట్టురట్టయింది. ఇప్పటికీ నిందితులకు శిక్ష పడలేదు. ఈ నేపథ్యంలో వివేకా కూతురు సునీతారెడ్డి, అల్లుడు రాజశేఖర్‌రెడ్డి కడప నగర శివారులోని జయరాజ్ గార్డెన్స్‌లో వివేకా ఐదవ స్మారకోత్సవ మరియు జ్ఞాపకార్థ సమావేశాన్ని శుక్రవారం ఉదయం11గంటలకు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి వివేకాకు, వైఎస్‌కు సన్నిహితంగా ఉన్న సుమారు 3వేల మందికి ఆహ్వానాలు పంపించారు. ఈ సమావేశానికి సీఎం జగన్ సోదరి, పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి హాజరు కానున్నారు.

సర్వత్రా ఆసక్తి


వివేకా హత్య కేసును విచారణ చేపట్టిన సీబీఐ.. ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి ఆయన తండ్రి భాస్కర్‌రెడ్డితో పాటు మరో ఆరుగురిపై కేసులు నమోదు చేసింది. ఒక కన్నును మరో కన్ను పొడుచుకుంటుందా అంటూ అసెంబ్లీ సాక్షిగా సీఎం జగన్ సోదరుడు వైఎస్ అవినాశ్‌రెడ్డిని వెనకేసుకు రావడం అప్పట్లో దుమారం రేపింది. సీఎం జగన్‌కు వివేకా కూతురు సునీతతో పాటు సొంత చెల్లెలు షర్మిలారెడ్డి దూరంగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం జరిగే సమావేశంలో సునీతారెడ్డి రాజకీయంగా ఏమైనా ప్రకటన చేస్తారా అన్న ఆసక్తి అందరిలో నెలకొంది. తన కుటుంబ సభ్యులు ఎన్నికల్లో పోటీ చేసే అంశంపై ఏమైనా వెల్లడిస్తారా అన్నదానిపై మిగతా పార్టీల కన్నా వైసీపీ నేతలు చాలా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

పులివెందులలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిస్తాం

- 17వ తేదీ సభ నుంచే జగన్ పతనం ప్రారంభం
- పులివెందుల టీడీపీ అభ్యర్థి బీటెక్ రవి

పులివెందుల టౌన్, మార్చి 14: పులివెందులలో వచ్చే ఎన్నికల్లో బీజేపీ, జనసేన కూటమి సహాయంతో ప్రతిఓటరు ధైర్యంగా ఓటు వేసేలా అవకాశం కల్పించి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షింపజేస్తామని పులివెందుల టీడీపీ అభ్యర్థి బీటెక్ రవి అన్నారు. గురువారం ఉదయం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో బీజేపీ, జనసేన నాయకులతో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తు కోసమే బీజేపీతో పొత్తుకు వెళ్తున్నామన్నారు. ఈనెల 17వ తేదీన జరిగే మహాసభకు చంద్రబాబునాయుడుతో పాటు ప్రధాని మోదీ, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ హాజరుకానున్నారని ఆరోజు నుంచే జగన్ పతనం ప్రారంభమవుతుందన్నారు. మళ్లీ పొరపాటున జగన్ అధికారంలోకి వస్తే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఉనికికే ప్రమాదమని మేధావులు ప్రజలు భావిస్తున్నారని అన్నారు. రాక్షస పాలన నుంచి విముక్తి కల్పించేందుకే కూటమి సిద్ధంగా ఉందన్నారు. ఈసారి ఎన్నికల్లో ప్రతి బూతులో కూడా ఏజెంట్‌ను నిలబెడతామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డి, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


టీడీపీ, బీజేపీ, జనసేన ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న బీటెక్ రవి



అవస్థలే

- ఇబ్బందుల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు
- ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్న స్థానికులు

జమ్మలమడుగు, మార్చి 14: నాడు-నేడుతో పాఠశాలల రూపురేఖలు మార్చేశామని వైసీపీ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోంది. వాస్తవానికి చాలాచోట్ల నాడు-నేడు పనులు అర్ధంతరంగా ఆగి విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికి జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని ఎస్సీ కాలనీలో ఉన్న మండల ప్రజాపరిషత్ పాఠశాలే ఉదాహరణ. ఈ పాఠశాలను అధికారులు ఏడాదిన్నర క్రితం నాడు-నేడు పనులకు ఎంపిక చేశారు. ఆ తర్వాత పాఠశాలకు ఉన్న నాపరాళ్లతో ఉన్న ప్రహరీ బండలను తొలగించారు. పాఠశాల ఆవరణంలో ఒక భవనం నిర్మించేందుకు, దాని పక్కనే డ్రైనేజీ గుంతను తీసి పనులు చేపట్టారు. పాఠశాలకు ప్రహరీగోడ నిర్మించేందుకు కడ్డీలు ఏర్పాటు చేసి పిల్లర్లు వేశారు. అంతటితో పనులు ఆగిపోయాయి.

పాఠశాలలోకి పశువులు

ప్రహరీగోడ లేకపోవడంతో పాఠశాల ఆవరణలోకి పందులు, ఆవులు, గేదెలు వస్తుండటంతో విద్యార్థులు ఇబ్బంది పడేవారు. ఆవరణలో కూర్చొని మధ్యాహ్నం విద్యార్థులు భోజనం చేయాలన్నా ఇబ్బందికరంగా ఉండేది. దీంతో పాఠశాల ఉపాధ్యాయులే నాపరాళ్ల బండలతో ప్రహరీ ఏర్పాటు చేసుకున్నట్లు తెలుస్తోంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు నాడు-నేడు పనులు ఏ మాత్రం ముందుకు సాగలేదని స్థానికులు వాపోతున్నారు. పాఠశాల ఆవరణలో ప్రస్తుతం మరుగుదొడ్లకు సంబంధించి గుంత తవ్వి ఇటుకలతో కట్టి వదిలేశారు. తర్వాత ఎలాంటి పనులు ముందుకు సాగలేదు. ఎస్సీ పాఠశాలపై ప్రభుత్వానికి, అధికారులకు ఎందకంత నిర్లక్ష్యమని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఈ పాఠశాలకు నాడు-నేడు పనులకు సంబంధించి రూ.16 లక్షలు టార్గెట్ ఇచ్చి ఇప్పటి వరకు రూ.6 లక్షలకు పైగా మంజూరు చేసినట్లు తెలుస్తోంది.

గుంతలతో ఇబ్బందులు

ఏది ఏమైనా పాఠశాల ఆవరణంలో గుంతలు, పిల్లర్స్ వేయడానికి వదిలేసిన కడ్డీలు ప్రమాదకరంగా మారాయని స్థానికులు వాపోతున్నారు. పాఠశాలలో సుమారు 80 మందికిపైగా విద్యార్థులు చదువుకుంటున్నారని.. నలుగురు ఉపాధ్యాయులు ఉన్నారని, పాఠశాల హెడ్మాస్టర్ తెలిపారు. నాడు-నేడు పనులు ఎంపికలో భాగంగా డోర్లు, కిటికీలు, లైట్లు తదితర వస్తువులన్నీ అధికారులే ఇచ్చారని, అవన్నీ నాసిరకంగా ఉండడంతో పనికి రాకుండా పోయాయని తెలిపారు. ప్రస్తుతం విద్యార్థులకు ఇబ్బందికరంగా ఉండడంతో తామే బండలు నాటుకున్నామని ఆమె తెలిపారు. పనుల నిర్లక్ష్యం, విద్యార్థుల ఇబ్బందులపై హెడ్మాస్టర్ దేవమణిని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా నిధులు లేక పనులు ఆలస్యమయ్యాయన్నారు. ఇప్పటివరకు రూ.16లక్షలకుగాను రూ.6.21 లక్షలు మంజూరయ్యాయని, మిగతా రూ.10 లక్షలు మంజూరైతేనే పాఠశాల అభివృద్ధి జరుగుతుందన్నారు.


నిర్మాణం పూర్తికాని డ్రైనేజీ గుంత


ప్రహరీ నిర్మాణం జరగకపోవడంతో రక్షణ కోసం పిల్లర్స్ కడ్డీలను వదిలేసి బండలు నాటిన దృశ్యం


ఎస్సీ కాలనీలోని పాఠశాల ఆవరణలోకి వచ్చిన పశువులను తోలుతున్న విద్యార్థులు

ఈబీసీ మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయం : డీఆర్వో


లబ్ధిదారులకు చెక్కును అందజేస్తున్న డీఆర్వో గంగాధర్ గౌడ్

కడప(కలెక్టరేట్), మార్చి 14: ఈబీసీ నేస్తం పథకం ద్వారా ఈబీసీ వర్గాలను ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ ధ్యేయమని జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్ పేర్కొన్నారు. గురువారం నంద్యాల జిల్లా బనగాన పల్లి బహిరంగ సభ నుంచి వీడియో కాన్ఫరెన్సు ద్వారా 3వ విడత ఈబీసీ నేస్తం లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో రూ.15 వేల సాయం మొత్తాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కంప్యూటర్ బటన్ నొక్కి వేశారు. ఈ కార్య క్రమానికి కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి డీఆర్వోతో పాటు జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీ జయసింహ హాజరయ్యారు. సీఎం కార్యక్రమం అనంతరం ఈబీసీ నేస్తం పథకం కింద జిల్లాలో లబ్ధి పొందిన 34,145 మంది అగ్రవర్ణ పేద మహిళలకు మంజూరైన రూ.51.21 లక్షల మెగా చెక్కును అందజేశారు.

అక్రమాలకు అడ్డాగా డీసీఎంఎస్

రైతులకు వెన్నుదన్నుగా నిలవాల్సిన జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ అక్రమాలకు అడ్డాగా మారుతోంది. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు వ్యవసాయ పనిముట్లను అందించేందుకు ఏర్పాటు చేసిన సహకార మార్కెటింగ్ సొసైటీకి ఉమ్మడి కడప జిల్లాలోని పలు ప్రాంతాల్లో స్థలాలు ఉన్నాయి. వాటిల్లో చాలావరకు అన్యాక్రాంతమయ్యాయి. మిగిలిన స్థలాలను అయినా కాపాడుకునే పరిస్థితుల్లో డీసీఎంఎస్ పాలకవర్గం, అధికార యంత్రాంగం చిత్తశుద్ధి చూపడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందులో అందిన కాడికి దండుకునేందుకే ప్రయత్నిస్తున్నారు తప్ప ఆస్తులను పరిరక్షించుకునే ప్రయత్నం చేయడం లేదని సమాచారం.

● విలువైన స్థలాలు అన్యాక్రాంతం ● ఆస్తులను రక్షించాల్సిన వారే.. భక్షిస్తున్నారు ● సంస్థ కంటే సంపాదనకే పెద్దపీట



కడప చెమ్ముమియాపేట స్థలంలో నిర్మాణంలో ఉన్న రిఫ్రిజిరేటర్ల తయారీ కేంద్రం



రాజంపేటలో అక్రమంగా నిర్మిస్తున్న కాంప్లెక్స్

కడప (ఎన్టీఆర్ సర్కిల్), మార్చి 14: కడప నగరం నడిబొడ్డున ఉన్న డీసీఎంఎస్ కాంప్లెక్స్‌లో కార్యాలయంతో పాటు వ్యాపార సముదాయ గదులను నిర్మించి లీజుకు ఇచ్చారు. ఎక్కడైనా ఒకసారి లీజుకు ఇస్తే కొన్ని సంవత్సరాల తరువాత లీజు పెంపు చేసి అగ్రిమెంటు చేస్తారు. అయితే ఇక్కడ మాత్రం అద్దె తగ్గించి లీజు అగ్రిమెంట్లు చేస్తున్నట్లు సమాచారం. ఖాళీగా ఉన్న గదులను డీసీఎంఎస్ కార్యాలయంలోని కొంతమంది సిబ్బంది అనధికారికంగా వినియోగించుకుంటూ అసాంఘికాలకు నిలయంగా మార్చారని గుసగుసలు వినిపిస్తున్నాయి.

విలువైన స్థలాలు అన్యాక్రాంతం

జిల్లాలో డీసీఎంఎస్‌కు పలుచోట్ల స్థలాలు ఉన్నాయి. ఈ స్థలాలు ఎక్కువ భాగం ఆక్రమణలకు గురవుతున్నాయని అంటున్నారు. రెవెన్యూ డివిజన్ కేంద్రం అయిన రాజంపేటలో స్థలం ఆక్రమించుకున్నట్లు సమాచారం. నియోజకవర్గ కేంద్రమైన కమలాపురంలో ఉన్న స్థలాన్ని కొంతమంది ఆక్రమించుకుని కట్టడాలు చేపట్టారు. మరికొంత స్థలాన్ని ఇతరులకు విక్రయించినట్లు తెలుస్తోంది. ముద్దనూరు మండలంలో కూడా రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న డీసీఎంఎస్ గోదాం స్థలాన్ని కొంత కాలం క్రితం ఆక్రమించుకునేందుకు ప్రయత్నించగా ఆంధ్రజ్యోతి వెలుగులోకి తీసుకువచ్చింది. దీంతో అధికారులు స్పందించి ఆక్రమణలు నిలువరించారు. కమలాపురం మండలంలోని మరో గ్రామంలో కూడా డీసీఎంఎస్ స్థలాన్ని ఆక్రమించుకున్నారు. పుల్లంపేటలో ఉన్న స్థలం కూడా ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.

రూ.కోట్ల విలువ చేసే స్థలం.. కబ్జాదారుల పరం

కడప నగరంలో చెమ్ముమియాపేటలో డీసీఎంఎస్‌కు సర్వే నెం.563/1లో నాలుగు ఎకరాల స్థలం ఉండేది. 2007లో అప్పటి పాలకవర్గం బహిరంగ వేలం ద్వారా 1.85 ఎకరాలు రూ.2.70 కోట్లకు విక్రయించారు. మిగతా స్థలంలో గోదాంలు, ఖాళీ స్థలం ఉంది. పలు దఫాలుగా ఈ స్థలాన్ని ఆక్రమించుకునేందుకు ప్రయత్నం జరిగింది. ఈపీఐసీ కమిటీ రాక ముందు ఇన్‌చార్జి చైర్‌పర్సన్‌గా ఉన్న జేసీ కొలతలు వేయించి ఆక్రమణలను నిలువరించ గలిగారు. అయితే ప్రస్తుతం అధికారంలో ఉన్న పర్సన్ ఇన్‌చార్జి కమిటీ, డీసీఎంఎస్‌లోని కొంతమంది అధికారులు కలిసి ఖాళీ స్థలాన్ని ఆక్రమణదారులకు నిబంధనలకు విరుద్ధంగా సుదీర్ఘకాలానికి లీజుకు ఇచ్చినట్లు సమాచారం. ఇందులో సుమారు రూ.50లక్షల మేర చేతులు మారినట్లు చర్చ సాగుతోంది.

లీజుకు కాదు.. అద్దెకిచ్చాం..



కడప నగరంలోని చెమ్ముమియాపేటలో ఉన్న డీసీఎంఎస్ స్థలంలో ఖాళీగా ఉన్న ప్లాట్లను లీజుకు ఇచ్చాం అనేది అవాస్తవం. ఖాళీగా ఉంటే ఆక్రమించుకుంటారనే ఉద్దేశ్యంతో నెలసరి అద్దెకు మాత్రమే ఇచ్చాం. అద్దెకు స్థలాలు పొందిన వారు నిర్మాణాలు చేపడుతున్నారు.

\- ఖాదర్‌వల్లి, బిజినెస్ మేనేజర్, డీసీఎంఎస్

రహస్యంగా అప్పగించడం ఏమిటి?

ఓపెన్ టెండర్లు పిలవకుండా రహస్యంగా స్థలాలు అప్పగించడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనల ప్రకారం సంస్థ స్థలాలకు ఓపెన్ టెండర్లు పిలవాల్సి ఉంటుంది. అలా కాకుండా ఎవరు ఎక్కువ డబ్బులు ఇస్తే వారికి చెమ్ముమియాపేట స్థలాన్ని అప్పగించినట్లు తెలుస్తోంది. ఈక్రమంలో స్థలాలు పొందిన వారు ప్లాట్ నెంబరు-1లో 10 సెంట్లు స్థలంలో పర్మినెంటుగా టీ స్నాక్స్ అల్పాహార హోటల్ నిర్మించారు. రెండో ప్లాటులో, మూడో ప్లాటులో 20 సెంట్లలో నిర్మాణానికి సిద్ధపడ్డారు. ప్లాట్ నెం.5లో 10 సెంట్ల స్థలంలో భవన నిర్మాణానికి సిద్ధం చేశారు. మరో ప్లాటులో 30 సెంట్ల స్థలంలో కర్మాగారాన్ని నిర్మించి అందులో రిఫ్రిజిరేటర్లు తయారు చేస్తున్నారు. ప్లాట్ నెం.7లో 10 సెంట్ల స్థలంలో బేస్‌మెంటు వేసి నిర్మాణానికి సిద్ధం చేశారు.

సొసైటీ వద్ద కోట్లాది రూపాయలు నిధులు ఉన్నాయి. ఈ ప్రాంతం వ్యాపారానికి చాలా అనుకూలంగా ఉంటుంది. సొసైటీనే వ్యాపార సంస్థలకు అగ్రిమెంటు చేసుకుంటే కమర్షియల్ కాంప్లెక్స్‌లు నిర్మించి అద్దెకివ్వడం ద్వారా సంస్థ మరింత ఆదాయం పొందవచ్చు. అలా కాకుండా నామినేటెడ్ కమిటీ అధికారులు కలిసి ప్రైవేటు వ్యాపారులతో కుమ్మక్కై విలువైన స్థలాన్ని ధారాదత్తం చేశారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్వప్రయోజనాల కోసం సంఘం ఆస్తులకు పాలకవర్గం నష్టం కలిగించడం, డీసీఎంఎస్ అధికారులు ప్రేక్షకపాత్ర వహించడంపై సహకారశాఖ అధికారులకు, రాష్ట్ర సహకార సంఘాల కమిషనర్, రిజిస్టరుకు ఫిర్యాదులు వెళ్లాయని సమాచారం.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

కడప (క్రైం), మార్చి 14 : కడప నగరంలోని రామచంద్రాపురంలో నివాసం ఉంటున్న జింకా దస్తగిరి అలియాస్ మనోజ్ (29) అనే వ్యక్తి గురువారం ఉదయం కడప రిమ్స్‌లో చికిత్స పొందుతూ అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఈ సంఘటనపై పోలీసులు, స్థానికులు, బంధువుల సమాచారం మేరకు.. కడప నగరంలోని తాలుకా పోలీసుస్టేషన్ పరిధిలో రామచంద్రాపురంలో నివాసం ఉంటున్న జింకా మహబూబ్‌బీ, హుసేన్‌వలి అలియాస్ వలికి ముగ్గురు సంతానం. దస్తగిరి, సోనీ, సుభాన్. వీరిలో సోని 14 సంవత్సరాల కిందట అనారోగ్యంతో మృతి చెందింది. కుమార్తె మృతి విషయంలో భార్యాభర్తలిరువురికీ మనస్పర్థలు ఏర్పడ్డాయి. దీంతో మహబూబ్‌బీ, హుసేన్‌వలి విడిపోయారు. ప్రస్తుతం హుసేన్‌వలి మైదుకూరులో నివాసం ఉంటున్నాడు. తన భర్తతో విడిపోయినప్పటి నుంచి రామచంద్రాపురంలోనే నివాసం ఉంటున్న మహబూబ్‌బీ పాలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తుండేది. పెద్ద కుమారుడు దస్తగిరి అలియాస్ మనోజ్ (29) ఓ ప్రైవేటు పెయింటింగ్ సంస్థలో రాయలసీమ రీజనల్ ఇన్‌చార్జ్‌గా ఉన్నాడు. రెండు సంవత్సరాల క్రితం చిన్నచౌకు ప్రాంతంలోని ఓ యువతిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. తరువాత వారి మధ్య విభేదాలు వచ్చి దూరంగా ఉంటున్నారు. కాగా దస్తగిరి సోదరుడు సుభాన్ బీటెక్ చదివి ఉద్యోగాన్వేషణలో ఉన్నాడు. ఈ క్రమంలో ఈనెల 13వ తేదీ రాత్రి 10 గంటల వరకు తల్లి, ఇద్దరు కుమారులు కలిసి కబుర్లు చెప్పుకున్నారు. పైగదిలో సుభాన్, బయట వసారాలో తల్లి, కింద గదిలో దస్తగిరి పడుకున్నారు. 14న తెల్లవారుజామున ఉన్నట్లుండి కేకలు వినిపించడంతో సుభాన్ కిందకు వచ్చాడు. ఆ సమయంలో దస్తగిరి శరీరమంతా మంటలతో కాలిపోయింది. స్థానికుల సహకారంతో మంటలను ఆర్పివేసి 108లో కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. అక్కడ వార్డులో చికిత్స పొందుతూ ఉదయం 10.30కు దస్తగిరి మృతి చెందాడు. ఆ సంఘటనలో తల్లికి, కుమారుడికి మధ్య ఏవో మనస్పర్థలు ఏర్పడి పెయింటు పనుల్లో ఉపయోగించే టిన్నర్‌ను చల్లి నిప్పంటించిందని భావిస్తున్నారు. ప్రస్తుతం ఆమె పరారీలో ఉంది. ఆమె ఆచూకీ తెలిసి, విచారిస్తే నిజానిజాలు తెలుస్తాయని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి తమ్ముడు సుభాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద స్థితిలో మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజా తెలిపారు.

నా భార్య బారి నుంచి కాపాడండి

● ఎస్పీని వేడుకున్న బాధితుడు

రాయచోటిటౌన్, మార్చి 14: రాయచోటి పట్టణానికి చెందిన ఒక ప్రభుత్వ ఉద్యోగి తన భార్య నుంచి తనకు రక్షణ కల్పించాలని గురువారం ఎస్పీ కృష్ణారావుకు విజ్ఞప్తి చేశారు. ఇందుకు సంబంధించిన వివరాల్లోకి వెళితే... రాయచోటి పట్టణం గాంధీబజార్‌లో నివాసం ఉంటున్న పసుపులేటి కిశోర్‌కుమార్ సుండుపల్లె ఎంపీడీవో ఆఫీసులో టైపిస్టుగా పనిచేస్తున్నారు. ఇతను 2019 సంవత్సరంలో నంద్యాల జిల్లా ఆళ్లగడ్డకు చెందిన నాగేశ్వరి అనే మహిళను వివాహం చేసుకున్నాడు. కిశోర్‌కుమార్ ఉద్యోగ రీత్యా ప్రతిరోజూ ఉదయం సుండుపల్లెకు వెళ్లి సాయంత్రానికి ఇంటికి వచ్చేవాడు. ఆ సమయంలో అతడి భార్య ప్రియుడితో ఇంట్లో గడిపేదని, దీనిని గమనించిన కిశోర్‌కుమార్ తల్లి పెంచలమ్మ ఆమెను పలుమార్లు మందలించింది. ఇది మనసులో పెట్టుకుని మా తల్లి పెంచలమ్మను కూడా తన భార్య ఇంట్లో లేకుండా చేసిందని కిశోర్‌కుమార్ ఎస్పీకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై భార్యను నిలదీయడంతో ఆమె తనను అంతమొందించి నా ఉద్యోగాన్ని పొందడానికి ప్రియుడితో కలిసి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారని, అందుకే నేను రెండు నెలల పాటు సెలవు పెట్టి ప్రాణభయంతో రాయచోటిని విడిచి వెళ్లిపోయానని ఆయన ఫిర్యాదులో తెలిపారు. నన్ను ఏదో విధంగా రాయచోటికి పిలిపించి నన్ను నిర్బంధించి ఏదో ఒకటి చేయడానికి నేను కనిపించకుండా పోయినట్లు రాయచోటి పోలీసులకు తన భార్య ఫిర్యాదు చేసిందన్నారు. వారిద్దరూ కలిసి నన్ను చంపే అవకాశం ఉందని, వారి బారి నుంచి నా ప్రాణాలను కాపాడాలని ఎస్పీకి ఇచ్చిన ఫిర్యాదులో కిశోర్‌కుమార్ పేర్కొన్నారు.

సైనిక్ స్కూలు ప్రవేశాల్లో బాలవికాస్ విద్యార్థుల విజయం



విద్యార్థులను అభినందిస్తున్న బాలవికాస్ స్కూల్ కరస్పాండెంట్ సుబ్బరాయుడు, డైరెక్టరు గంగయ్య

కడప (ఎడ్యుకేషన్), మార్చి 14 : సైనిక్ స్కూలు ప్రవేశ పరీక్షా ఫలితాల్లో కడప నగరంలోని బాలవికాస్ విద్యార్థులు జాతీయ స్థాయిలో అత్యున్నత ర్యాంకులు సాధించారని పాఠశాల కరస్పాండెంట్ సుబ్బరాయుడు, డైరెక్టరు గంగయ్య తెలిపారు. ఆరాధ్యక్రిష్ణ 275 మార్కులు సాధించి జాతీయ స్థాయిలో 351 ర్యాంకు సాధించిందన్నారు. అలాగే సీబీ నిరుపమారెడ్డి 274 మార్కులతో 396వ ర్యాంకు, పి.కళ్యాణ్‌రామ్ 269 మార్కులతో జాతీయ స్థాయిలో 992వ ర్యాంకు సాధించారన్నారు. అలాగే ఎస్ఎండీ రెహ్మాన్ 261 మార్కులు, ఎం.లక్ష్మి మాతేష్ 260, బి.హిమజ 258, ఎం.నరసింహ దినేష్ 256, వైశ్రావణ్‌సిద్ధార్థరెడ్డి 257 మార్కులు సాధించారన్నారు.

పరీక్షలకు 78 మంది విద్యార్థులు హాజరు కాగా అందులో 75 మంది విద్యార్థులు ఈ-కౌన్సిలింగ్‌కు క్వాలిఫై అయినట్లు తెలిపారు. ఈ ఫలితాలు వచ్చేందుకు కృషి చేసిన అధ్యాపకులు ధరణీకుమార్, హైమావతి, లావణ్యలను పాఠశాల యాజమాన్యం అభినందించారు. ప్రోగ్రాం కో-ఆర్డినేటరు ధరణీకుమార్‌కు విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా సరస్వతీ పూజ



వీరభద్రాలయంలో సరస్వతిదేవి పూజకు హాజరైన విద్యార్థులు

రాయచోటి టౌన్, మార్చి 14: రాయచోటి పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం వీరభద్రాలయంలో భక్తిశ్రద్ధలతో సరస్వతిదేవి పూజ నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భద్రకాళీ సమేత వీరభద్రుడి ఉత్సవ విగ్రహాలకు భక్తిశ్రద్ధలతో సరస్వతిదేవి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే వీరభద్రుడు, భద్రకాళీ అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలు, వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి అశ్వవాహనంపై ఏర్పాటు చేసి పట్టణ పురవీధుల్లో గుండా పార్వేట ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అశ్వవాహనం సందర్భంగా నీలకంఠ్రావుపేటకు చెందిన బృందం చెక్కభజన కార్యక్రమం, భజన గురువు తుమ్మల హరినాథ ఆధ్వర్యంలో కోలాటం కార్యక్రమాలతో పట్టణ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. వాహనాల ఊరేగింపు సందర్భంగా పట్టణ భక్తులతో పాటు కన్నడ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శనం చేసుకుని కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

సీతాకోక చిలుకలపై పరిశోధనలు

● వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్



సదస్సులో మాట్లాడుతున్న వైస్‌చాన్సలర్ చింతా సుధాకర్

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 14 : జీవవైవిధ్యతకు కారణమైన సీతాకోక చిలుకలపై విస్తృత పరిశోధనలు జరగాల్సి ఉందని వైస్ చాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్ పేర్కొన్నారు. గురువారం వైవీయూ పరిపాలన భవనంలో జంతుశాస్త్ర శాఖ ఆధ్వర్యంలోబయోడైవర్సిటీ బట్టర్‌ఫ్లై బయాలజీ అండ్ కన్జర్వేషన్ మేనేజ్‌మెంటు జాతీయ వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా చింతా సుధాకర్ మాట్లాడుతూ గుడ్డు దశ నుంచి సీతాకోక చిలుకగా మారే దశలో శ్రమకోర్చి కొత్త రూపాన్ని సంతరించుకుంటుందన్నారు. దాని జీవిత కాలం స్వల్పమైనా అందంగా జీవిస్తూ జీవవైవిధ్యత కాపాడుకుంటుందన్నారు.

సీతాకోక చిలుకలు ప్రకృతి మనకు ఇచ్చిన వరమని, భారతదేశంలో 75 జాతులు గుర్తించినట్లు తెలిపారు. జీవ సమతుల్యతను నిలబెట్టే సౌందర్యాత్మక కళాత్మక కీటకం సీతాకోక చిలుక అన్నారు. పరిశోధనల ద్వారా హైబ్రిడ్ రావాలని రంగంలో విస్తృత పరిశోధనలు జరగాలని యువ పరిశోధకులకు సూచించారు. రిజిస్ట్రారు వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ ఆవరణ వ్యవస్థలో సీతాకోకచిలుకలు కీలకమన్నారు. ఆరోగ్యకర మూన వాతావరణానికి ఆ కీటకం ఎంతో అవసరమని చెప్పారు. ప్రిన్సిపల్ రఘునాథరెడ్డి మాట్లాడుతూ సీతాకోక చిలుకల సంరక్షణ జరగాలన్నారు. అనంతరం ప్యాకల్టీ ఆఫ్ సైన్సెస్ డీన్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి, పుదుచ్చేరి యూనివర్సిటీ ఎకో ఫౌండేషన్‌సీనియర్ వైల్డ్ లైఫ్ బయాలజిస్ట్ వ్యవస్థాపకులు డైరెక్టరు ఎం.భూపేష్‌గుప్త, ఆర్గనైజింగ్ సెక్రటరీ కన్వీనరు వెంకటరమణ జంతు శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ వెంకట్రామిరెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జంతుశాస్త్ర శాఖ అసిస్టెంటు ప్రొఫెసర్లు డాక్టర్ అనుప్రసన్న, డాక్టర్ వెంకటరమణారెడ్డి, అధ్యాపకులు మరియదాస్, మనస్విత, వేరోనిక విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు : జేసీ



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

రాయచోటి (కలెక్టరేట్), మార్చి 14: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, రవాణా శాఖ, పోలీసు అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో రోడ్డు ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన భద్రతా చర్యలపై జేసీ అధ్యక్షతన వివిధ శాఖాధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు రోడ్డు భద్రత కమిటీలోని ప్రభుత్వ శాఖలన్నీ సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. ప్రమాదాల బ్లాక్ స్పాట్ ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు, స్టడ్స్, కల్వర్టులు, అండర్ పాస్‌ల వద్ద రేడియం స్టిక్కర్లు, సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. పోలీసు, రవాణాశాఖ పక్కా ప్రణాళికతో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రమాదాలు జరిగినప్పుడు బాధితులకు తక్షణ వైద్యం అందించేందుకు సహాయం చేసిన వ్యక్తులకు గుడ్ సమర్టాన్ పథకం కింద నగదు పురస్కారం అందిస్తారని, దీనిపై పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలన్నారు. డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి రవాణా శాఖ అధికారి దినేశ్ చంద్ర, ఆర్డీవో రంగస్వామి, డీఎస్పీ మహబూబ్‌బాషా, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, సహాయ ఇన్‌స్పెక్టర్లు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గుప్తనిధుల తవ్వకాల ముఠా అరెస్టు

పోరుమామిళ్ల, మార్చి 14: మండలంలోని రేపల్లె గ్రామ సమీపంలో ఉన్న చెన్నకేశవస్వామి ఆలయంలో గుప్తనిధుల కోసం తవ్వకాల జరుపుతున్న నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. గురువారం రేపల్లె గ్రామ సమీపంలో ఉన్న చెన్నకేశవస్వామి ఆలయంలో ఆళ్లగడ్డకు చెందిన శంకర్, మరో ముగ్గురు వ్యక్తులు తవ్వకాలు జరుపుతున్నట్లు విషయం తెలియడంతో వారిని అరెస్టు చేశామన్నారు. అలాగే వారి వద్ద ఉన్న కారును సీజ్ చేసినట్లు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

పోరుమామిళ్ల, మార్చి 14 : పేకాట ఆడుతున్న ముగ్గురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.2600 నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ మల్లిఖార్జునరెడ్డి తెలిపారు. పోరుమామిళ్ల మండలంలోని రంగసముద్రం పంచాయతీ పరిధిలో ఎస్సీ కాలనీ సమీపంలో కంప చెట్ల దగ్గర పేకాట ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

వైసీపీ పాలనలో రాష్ట్రం అస్తవ్యస్తం

● టీడీపీ కడప ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి

కడప (ఎడ్యుకేషన్), మార్చి 14 :ఒక్క అవకాశం అంటూ అధికారం చేపట్టిన జగన్‌రెడ్డి ప్రణాళిక లేకుండా సాగించిన పాలనతో రాష్ట్రంలో అన్ని వ్యవస్థలు అస్తవ్యస్తంగా మారాయని, అభివృద్ధి కుంటుపడిందని కడప టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్.మాధవీరెడ్డి విమర్శించారు. గురువారం కడప నగరం 37వ డివిజన్ వార్తా ఆఫీసు నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందజేశారు. అలాగే టీడీపీ అధికారంలోకి వచ్చాక చేపట్టబోయే అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో అరాచకాలు మితిమీరిపోయాయన్నారు. దీనికి అడ్డుకట్టవేయాల్సిన సమయం ఆసన్నమైందని, ప్రజలందరూ ఏకమై వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని పిలుపునిచ్చారు. ఎంతో అనుభవం ఉన్న చంద్రబాబునాయుడిని సీఎంను చేసుకుంటే రాష్ట్రంలో మళ్లీ అభివృద్ధి, సంక్షేమం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు యువరాజ్, జాకీర్, మన్సూర్, ఆక్తర్‌ఖాన్, గంగిశెట్టి, వెంకటేశ్ రమణ పాలెంపల్లె సుబ్బారెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో మాధవీరెడ్డి

'పాస్టర్ల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం'

కడప (ఎడ్యుకేషన్), మార్చి 14 : పాస్టర్ల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు విఫలమయ్యాయని పాస్టర్ల సంఘం ప్రధాన కార్యదర్శి దాసరి సుధాకర్ తెలిపారు. గురువారం మాసాపేట కొత్తకొట్టాలు ఎలిమో ప్రార్థనామందిరంలో ఇండిపెండెంట్ పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని పాస్టర్లందరికీ గౌరవ వేతనం ఇవ్వాలన్నారు. ఇల్లు, ఇళ్లస్థలాలు మంజూరు చేసి ప్రత్యేక కాలనీ ఏర్పాటు చేయాలని కోరారు. కొత్తగా చర్చి నిర్మాణానికి ఐదు సెంట్లు స్థలం కేటాయించాలని మైనార్టీశాఖ నుంచి నిధులు మంజూరు చేయాలన్నారు. క్రైస్తవులపై జరుగుతున్నదాడులు నియంత్రణ కోసం ప్రత్యేక చటం తీసుకురావాలని కోరారు. అలాగే క్రైస్తవుల వివాహాలు సమావేశాలు జరుపుకునేందుకు క్రైస్తవుల కోసం ప్రత్యేక భవనంఏర్పాటు చేయాలని కోరారు. మెనార్టీ శాఖ నుంచి పాస్టర్లవివరాలు డిపార్ట్‌మెంటులో పొందుపరిచి వారికి ప్రభుత్వమే గుర్తింపుకార్డులు ఇవ్వలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు పాస్టర్ ఫిలిప్, జైభీం మాలమహాసేన అధ్యక్షులు పల్లెం కొండు సంపత్, టీడీపీ నగర కార్యదర్శి జలతోటి జయకుమార్ వివిధ చర్చిల పాస్టర్లు పాల్గొన్నారు.

సీకేదిన్నెలో పారామిలటరీ కవాతు

సీకేదిన్నె, మార్చి 14: రానున్న ఎన్నికల నేపథ్యంలో మండలంలోని రోడ్డుక్రిష్టాపురం, ప్రకాశం గ్రామాల్లో గురువారం సీఐ శివశంకర్‌నాయక్ ఆధ్వర్యంలో మిలటరీ ఫోర్స్ ఆయా గ్రామాల్లో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు ఎన్నికలపట్ల భయపడాల్సిన అవసరం లేదని, భద్రత కల్పిస్తామని తెలిపారు.

వేంపల్లెలో అమ్మవారి ఉత్సవాలు

వేంపల్లె, మార్చి 14: వేంపల్లె రాజీవ్‌నగర్ కాలనీలోని అంకాళమ్మ ఉత్సవాలు 15వ తేదీ నుంచి మూడు రోజుల పాటు జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నూతన ఆలయం నిర్మించిన తర్వాత ఘనంగా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. 15వ తేదీ ప్రత్యేక పూజలు, 16న అన్నదాన కార్యక్రమం, గ్రామోత్సవం నిర్వహించనున్నారు.17వ తేదీ సాసవుల చిన్నమ్మ కథ ఏర్పాటుచేశారు.

ఆడపిల్లల శాతాన్ని పెంచేందుకు కృషి చేయాలి

● జిల్లా సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫకృద్దీన్

కడప(కలెక్టరేట్) మార్చి14: ఆడపిల్లల శాతాన్ని పెంచేందుకు కృషి చేయాలని, లింగ నిర్ధారణకు పాల్పడితే స్కానింగ్ సెంటర్లు, వైద్య వృత్తిని శాశ్వతంగా రద్దు చేయడంతో పాటు జైలుశిక్ష తథ్యమని డీఎల్‌సీఏ సెక్రటరీ, జిల్లా సీనియర్ సివిల్ జడ్జి ఎస్ బాబా ఫకృద్దీన్ హెచ్చరించారు. గురువారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్లో జిల్లా వైద్య ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో డీఎంఅండ్ హెచ్ఓ డాక్టర్ నాగరాజు అధ్యక్షతన మాతా,శిశు మరణాల నిర్మూలనపై సంబంధిత అధికారులతో డిస్ట్రిక్ట్ లెవల్ అడ్వైజరీ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ ఆడబిడ్డను రక్షించుకోవడం మనందరీ బాధ్యత అన్నారు. ఆడ, మగ సమానమేనన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేసే స్కానింగ్ సెంటర్లు, డాక్టర్లను గుర్తిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. గర్భస్రావాలు జరగకుండా ఆపాలని, అందు కోసం ప్రజల్లో విస్తృత ప్రచారం, అవగాహన జరగాలన్నారు. భ్రూణ హత్యలు, మాతా శిశు మరణాల నివారణలో అంగన్వాడీలు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, మహిళా సంరక్షణ కార్యదర్శులు భాగస్వామ్యం కల్పించడమే కాకుండా లింగ నిర్ధారణ పరీక్షలపై నిఘా పెంచాల న్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఏఅండ్ హెచ్ఓ డాక్టర్ ఉమహేశ్వరకుమార్, ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి, సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, దిశ పోలీసు అధికారులు, వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు, ఐసీడీఎస్ సిబ్బంది, మహిళా మండలి సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫకృద్దీన్

బీసీ భవన్ ప్రారంభం

కడప (మారుతీనగర్), మార్చి 14 : కడప నగరం పాత రిమ్స్‌లో నూతనంగా నిర్మించిన బీసీ భవన్‌ను గురువారం బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తల లింగమూర్తి, గోవిందు నాగరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ భవన్‌ను జిల్లాలోని బీసీ ప్రజల సౌకర్యార్థం సుమారు రూ.ఐదు కోట్ల 65 లక్షలతో నిర్మించినట్లు తెలిపారు.

తలనీలాల వేలం రూ.65.11లక్షలు

చక్రాయపేట, మార్చి 14: గండి క్షేత్రంలో భక్తులు సమర్పించే తలనీలాల కోసం నిర్వహించిన వేలంపాట రూ.65.11లక్షలు పలికినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి తెలిపారు. గురువారం గండి క్షేత్రంలోని కార్యాలయంలో వేలం పాట నిర్వహించారు. సికింద్రాబాద్‌కు చెందిన మదర్ హ్యూమన్ హెయిర్ ఎంటర్ ప్రైజెస్ ప్రొప్రైయిటర్ ఆదినారాయణ ఈ టెండర్‌ను దక్కించుకున్నారని ఆయన పేర్కొన్నారు.

'జడ్పీ సీఈఓను సస్పెండ్ చేసి చైర్మన్‌ను బర్తరఫ్ చేయాలి'

కడప (సెవెన్‌రోడ్స్), మార్చి 14 : జిల్లా పరిషత్‌లో అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న జడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డిని సస్పెండ్ చేసి చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డిని బర్తరఫ్ చేయాలని సీపీఐ హెచ్చరించింది. కాంప్లెక్స్‌ల నిర్మాణం పేరుతో అధికార పార్టీకి చెందిన వారికి అడ్డగోలుగా కేటాయించారన్నారు. లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చ రించారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ప్రాంగణంలోని అన్నా క్యాంటిన్ స్థానంలో నూతనంగా ఏర్పాటు చేసిన క్రిష్ణ మహోన్నత హోటల్ వద్ద జరిగిన ఆందోళనలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర మాట్లాడారు. జిల్లా పరిషత్ చరిత్రలో గతంలో ఎన్నడు లేని విధంగా సంబంధిత స్థలంలో కాంప్లెక్స్‌ల నిర్మాణం చేపట్టి బహిరంగ వేలం నిర్వహించకుండా అయిన వారికి కట్టబెట్టడం నిబంధనలను ఉల్లంఘిచడమేనన్నారు. ఇటీవల జిల్లా పరిషత్ కాంప్లెక్స్ పై అంతస్తు ఏకపక్షంగా బీరం శ్రీధర్‌రెడ్డి కళాశాలకు కేటాయించడాన్ని నిరసిస్తూ ఆందోళన చేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కాగా జిల్లా పరిషత్ చైర్మన్, సీఈఓ ఏకపక్షంగా క్రిష్ణ మహోన్నత హోటల్‌కు కేటాయించడం దారుణమన్నారు. గతంలో ఇదే స్థానంలో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో అన్నాక్యాంటిన్ ఏర్పాటు చేశారన్నారు. అన్నా క్యాంటిన్ ప్రైవేటు వ్యక్తులకు కేటాయించాలనుకున్నప్పుడు ఎందుకు బహిరంగవేలం పిలవలేదని ప్రశ్నించారు. నగరపాలక సంస్థ నిర్మించిన అన్నా క్యాంటిన్‌ను అడ్డగోలుగా జిల్లా పరిషత్ సీఈఓ, చైర్మన్ ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతుంటే ప్రజాధనంతో నిర్మించిన నగరపాలక సంస్థ కమిషనర్ ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని ప్రశ్నించారు. జిల్లా పరిషత్ కాంప్లెక్స్ నిర్మాణానికి అనుమతులు లేకుంటే ఏ విధంగా నిర్మాణానికి అనుమతిస్తారని ప్రశ్నించారు. ఇంతజరుగుతున్నా కలెక్టరు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఇప్పటికైనా చర్యలు తీసుకోకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి ఎన్.వెంకటశివ, సహాయ కార్యద ర్శి కేసీబాదుల్లా, జిల్లా కార్యవర్గ సభ్యురాలు సి.బషీరున్నీసా, సుబ్రమణ్యం, మునెయ్య, ఏఐఎస్ఎఫ్ వలరాజు, వెంకటరాముడు, యానాదయ్య, అంకుశం, బాలచంద్రయ్య, రామ్మోహన్‌రెడ్డి, భాగ్యలక్ష్మి, చైతన్య, దస్తగిరి పాల్గొన్నారు.



ఆందోళన నిర్వహిస్తున్న సీపీఐ సభ్యులు

కార్మికులకు అందించిన సంక్షేమంపై సామాజిక తనిఖీ

పులివెందుల రూరల్, మార్చి 14: భవన నిర్మాణ కార్మికులతో పాటు ఇతర నిర్మాణ కార్మికులకు 2018-19 మరియు 2019-20లలో అందిన కార్మిక శాఖ నుంచి అందిన సంక్షేమంపై సామాజిక తనిఖీ ప్రజావేదిక సోమవారం నిర్వహించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ కార్యాలయ ఆవరణంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. భవన నిర్మాణ కార్మిక శాఖ జిల్లా జాయింట్ కమీషనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ 2018-19 మరియు 2019-20లలో అర్హులైన కార్మికులు మెటర్నిటీ, సాధారణ మరణాలు, పెళ్లిళ్లకు కార్మిక శాఖ సంక్షేమ బోర్డు నుంచి మంజూరైన నిధులు అర్హులకు చేరాయా లేదా అని తమ సిబ్బంది తనిఖీ చేసిందన్నారు. పులివెందుల పరిధిలో 2018-19లో 26 మందికి గాను రూ.5.60లక్షలు, 2019-20లో 17 మందికి రూ.3.50లక్షలు బోర్డు నుంచి జమ అయిందన్నారు. వేంపల్లె పరిధిలో 2018-19లో నలుగురికి రూ.1.70లక్షలు, 2019-20లో ఆరుగురికి రూ.1.70లక్షలు, వేముల పరిధిలో 2018-19లో ఇద్దరికి రూ.60వేలు, లింగాల పరిధిలో 2018-19లో ఒకరికి రూ.20వేలు, 2019-20లో ఐదుగురికి లక్ష రూపాయలు, సింహాద్రిపురం మండలంలో 2018-19లో ఇద్దరికి రూ.40వేలు, 2019-20లో రూ.20వేలు, వీరపునాయునిపల్లె మండల పరిధిలో 2018-19లో ఇద్దరికి రూ.40వేలు వారి ఖాతాలలో కార్మిక శాఖ సంక్షేమ బోర్డు జమ చేసిందన్నారు. అలాగే ప్రతి అసంఘటిత కార్మికులు ఇ-శ్రమ్ కార్డు పొందాలన్నారు. ఈ కార్డు ద్వారా దేశంలో ఎక్కడ పనిచేస్తున్న కేంద్ర ప్రభుత్వం కల్పించే వివిధ రకాల సంక్షేమ పథకాలను తీసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. పలువురు కార్మికులు ఐదేళ్ల నుంచి సంక్షేమ బోర్డు నుంచి ఒక్కరికి కూడా సంక్షేమం దక్కలేదని అడగ్గా రాష్ట్ర ప్రభుత్వం నిలుపుదల చేసిన విషయం మీకు తెలిసిందే అని సమాధానమిచ్చారు. అయితే మీరు దరఖాస్తులు తప్పకుండా చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ దివాకర్, వేముల ఎంపీడీఓ, కార్మిక శాఖ పులివెందుల అధికారి అల్లాబకాష్, ఎస్ఆర్‌పీ లక్ష్మినారాయణ, సీఆర్ఎన్ మూర్తి, డీఆర్పీలు మహేష్, మురళి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భవన నిర్మాణ కార్మిక శాఖ జిల్లా జాయింట్ కమిషనర్ శ్రీనివాసులు

భక్తిశ్రద్ధలతో అమ్మవారి ఉత్సవాలు

వేంపల్లె, మార్చి 14: వేంపల్లె రాజీవ్‌నగర్ కాలనీలోని అంకాళమ్మ తల్లి ఉత్సవాలు 15వ తేదీ నుంచి మూడు రోజుల పాటు జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నూతన అలయం నిర్మించిన తర్వాత ఘనంగా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. 15వ తేదీ ప్రత్యేక పూజలు, 16న అన్నదాన కార్యక్రమం, అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించనున్నారు. 17వ తేదీ సాసవుల చిన్నమ్మ కథ ఏర్పాటుచేశారు. అమ్మవారికి మొక్కులు తీర్చుకొని పూజలు నిర్వహిస్తారు. ఉత్సవాలను విజయవంతం చేయాలని స్థానిక ప్రజలు విజ్ఞప్తి చేశారు.

ధ్యాన సాధన ద్వారా ఏకాగ్రత సాధ్యం

పులివెందుల రూరల్, మార్చి 14: ధ్యాన సాధన ద్వారా వ్యక్తిత్వ పరధ్యానం నుంచి విముక్తుడై ఏకాగ్రత సాధ్యమవుతుందని యోగా గురువు వెంకటరామిరెడ్డి అన్నారు. గురువారం పులివెందుల జేఎన్టీయూ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో యోగా - వ్యక్తిత్వ వికాసం అనే అంశంపై అవగాహన తరగతులు నిర్వహించారు.

కడప ఎంపీ టికెట్ ఇవ్వండి

● టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పార్థసారధిరెడ్డి

కడప (మారుతీనగర్), మార్చి 14 : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ కడప పార్లమెంటు స్థానానికి తనకు టికెట్ ఇవ్వాలని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పార్థసారధిరెడ్డి కోరారు. గురువారం ఆయన కడప ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, ఆయన తండ్రి రాజారెడ్డి, ఆయన తమ్ముడు వైఎస్ వివేకానందరెడ్డి, వీసీ గంగిరెడ్డిలతో సుదీర్ఘకాలం పోరాటం సాగించామన్నారు. ప్రస్తుతం సీట్ల పంపిణీలో చంద్రబాబు చాలా బిజీగా ఉంటారని.. జిల్లాకు చెందిన నాయకులు తనను ఆయన వద్దకు తీసుకెళ్లలేని స్థితిలో ఉన్నారన్నారు. కడప నుంచి ఎంపీ స్థానానికి పోటీ చేసే దమ్ము ధైర్యం గల వారు టీడీపీలో చాలా మంది ఉన్నారన్నారు. వారిలో మొదటి వ్యక్తిని తానేనని గుర్తు చేశారు. కడప ఎంపీ స్థానం పరిధిలో తమ వర్గీయులు సుమారు 2 లక్షల మందికి పైగా ఉన్నారని, వారి ఓట్లతో తప్పక విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు.

సంపూర్ణ ఆరోగ్యానికి పౌష్టికాహారాన్ని తీసుకోవాలి

పెండ్లిమర్రి, మార్చి 14: గర్భిణీలు, బాలింతలు, పిల్లలు సంపూర్ణ ఆరోగ్యానికి పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సీకెదిన్నె ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ రమాదేవి అన్నారు. గురువారం మండలంలోని నాగయపల్లె, తుమ్మలూరు పంచాయతీల ఐసీడీఎస్ సిబ్బంది కలిసి పోషణా పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. చక్కగా చిరుధాన్యాల ప్రాముఖ్యత, మినుము నిత్యజీవితంలో నిత్యం ఏ విధంగా ఉపయోగించాలో తెలియజేశారు. పండ్లు, కూరగాయలు ఏ విధంగా వాటిలో ఏమేమి పోషకాలున్నాయో తెలిపారు.


పోషక విలువలున్న ఆహారం గురించి వివరిస్తున్న సీడీపీఓ రమాదేవి

విద్యార్థులు, యువత ఓటుతో రాష్ట్రాన్ని పునర్నిర్మించుకోవాలి

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 14 : విద్యార్థులు, యువత తమ ఓటుతో రాష్ట్రాన్ని పునర్నిర్మించుకోవాలని టీడీపీ కడప నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొజ్జ తిరుమలేశ్ పిలుపునిచ్చారు. గురువారం ద్వారకానగర్‌లోని మాధవీరెడ్డి కార్యాలయంలో టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొజ్జ తిరుమలేశ్ అధ్యక్షతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో విద్యార్థులు, యువత తమ తొలి ఓటుతో జగన్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం రాష్ట్రంలో అర్హత లేని ప్రజా ప్రతినిధులు స్వార్థపరులు అధికారంలో ఉండటం వల్లే విద్యావ్యవస్థ సర్వనాశనం అ యిందని మండిపడ్డారు. జిల్లా అధ్యక్షుడు బొజ్జ తిరుమలేశ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్ర భుత్వం 117 జీఓ తీసుకువచ్చి 3, 4, 5 తరగతుల పాఠశాలలను విలీనం చేసి జిల్లాలో 515 పాఠశాలలను మూసివేసిందన్నారు. చంద్రబాబు ప్రభుత్వంలో 40 మంది విద్యార్థులకు ఒక సెక్షన్ ఉంటే వైసీపీ ప్రభుత్వంలో 70 నుంచి 80 మందికి ఒక సెక్షన్ ఉందని, దీంతో ఉపాధ్యాయులపై భారం పడి విధులు సక్రమంగా చేయలేని పరిస్థితి నెలకొందన్నారు. కమిషన్ల కోసం బైజూస్ అని అప్పుల్లో ఉన్న సంస్థను తీసుకువచ్చి ప్రజాధనం దుర్వినియోగం చేశారన్నారు. ప్రచార ఆర్భాటంలో భాగంగా గ్రామాల్లో గోడలకు రంగులు పూశారని, అం దులో చదువు చెప్పేందుకు టీచర్లు మాత్రం లేరన్నారు. సమాజంలో గౌరవ ప్రదమైన వృత్తి ఉపాధ్యాయ వృత్తి అని, అలాంటి ఉపాధ్యాయులను వైన్‌షాపుల వద్ద కాపలా పెట్టిన ఘనత వైసీపీ ప్రభుత్వందని గుర్తు చేశారు. నాడు ఎన్నికల్లో కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అని ఇప్పుడు ఉన్నత విద్యకు ఫీరీయింబర్స్‌మెంటు రద్దు చేసి హామీని నిలబెట్టుకోలేకోయారన్నారు. టీడీపీ హయాంలో కళాశాల విశ్వవిద్యాలయ విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా ఫీరీయింబర్స్‌మెంటు నేరుగా కళాశాలల యాజమాన్యాలకు చేరేవన్నారు. విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసిన జగన్‌ను గద్దె దింపేందుకు విద్యార్థులు చైతన్యపరచి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ నాయకులు అనిల్, లోకేశ్, హమీద్, విశ్వనాథ్, గంగాధర్, రాజేష్, భార్గవ్, సమీర్, శ్రీను, జిలానీబాష పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొజ్జ తిరుమలేశ్

సైనిక్ స్కూలుకు 'వికాస్' విద్యార్థులు ఎంపిక

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 14 : ఆలిండియా సైనిక్ స్కూలు ప్రవేశపరీక్షల్లో దిన్నెపాటి బసిరెడ్డి కోచింగ్ సెంటరు విద్యార్థులు 16 మంది రాత పరీక్షల్లో అర్హత సాధించినట్లు పాఠశాల డైరెక్టరు దిన్నెపాటి బసిరెడ్డి తెలిపారు. వీరిలో 14 మంది బాలురు, ఇద్దరు బాలికలు ఉన్నారన్నారు. బీరం గురువర్ధన్‌రెడ్డి 300 మార్కులకు 222 మార్కులు సాధించారని, ఎస్.శివలోహిత్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రజ్వల్ తేజ్, కార్తీక్, ఎస్.తబరేజ్, రెడ్డినాగార్జున నాయక్. కేశవ, అబ్దుల్లా, లోహిత్, సాయిభరత్, మేరీ, దీక్షిత, నిరీక్షన్‌బాబు, అజయ్‌కుమార్ సీటు సాధించారన్నారు. ఆన్‌లైన్ పద్ధతితో స్కూలు ఎంపిక చేసుకోవాల్నారు. వీరి విజయానికి ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కృషి చేశారని సంస్థ కో ఆర్డినేటరు డి.శివకళ హర్షం వ్యక్తం చేశారు.


విద్యార్థులను అభినందిస్తున్న బసిరెడ్డి

విద్య ద్వారానే ఉజ్వల భవిష్యత్తు

● ఘనంగా పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సభ

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 14 :విద్య ద్వారానే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని చిన్మయా మిషన్ తురియానంద్ మహరాజ్ తెలిపారు. గురువారం కడప నగరం బాలవికాస్ హైస్కూలులో పదోతరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సమయాన్ని ఎప్పుడూ దుర్వినియోగం చేసుకోకూడదన్నారు. చదువు తరువాత ఉద్యోగమే లక్ష్యం కాకుండా సమాజ హితమే లక్ష్యం కావాలన్నారు. సమగ్ర శిక్ష జిల్లా పథక అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ చదువు కన్నా సంస్కారమే మిన్న అని, జ్ఞానం కన్నా లోకజ్ఞానం, భయం కన్నా భక్తిభావం మిన్న అన్నారు. అన్ని బలాల కన్నా ఆత్మబలమే గొప్పదన్నారు. ఆత్మబలంతోనే విద్యార్థి మంచి స్థాయికి చేరుకోవాలని సూచించారు. డాక్టర్ రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ తాను కూడా ఇక్కడ పనిచేశానని చెబుతూ ఈ పాఠశాలలో ఆయన పొందిన అనుభవాల గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సుబ్బరాయుడు, డైరెక్టరు గంగయ్య, మరో కరస్పాండెంట్ శ్రీలక్ష్మి. ప్రిన్సిపాల్ ఉషా తదితరులు పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న చిన్మయా మిషన్ ప్రతినిధి తురియానంద్ మహరాజ్, కరస్పాండెంట్ సుబ్బరాయుడు, డైరెక్టరు గంగయ్య

ఈక్రాప్ నమోదు పత్రాల పంపిణీ

కమలాపురం రూరల్, మార్చి 14 :ఈ క్రాప్ నమోదు చేయించుకున్న ప్రతి రైతుకు ఈ క్రాప్ నమోదు పత్రాలను అందిస్తున్నట్లు ఏడీఏ నరసింహారెడ్డి తెలిపారు. గురువారం మండల పరిధిలోని ఎర్రగుడిపాడు, నల్లలింగాయపల్లె గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటలకు ఈక్రాప్ నమోదు చేయించుకున్న రైతుల పేర్లను ఈ క్రాప్‌లో నమోదు తుది జాబితాను రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శించాలని తెలిపారు. 2023-24 రబీ సీజన్‌లో కమలాపురం మండలంలో శనగ, మినుము, వేరుశనగ, వరి, నువ్వులు, పెసర, కొర్ర పంటలను 20,133 ఎకరాల్లో సాగు చేశారన్నారు. మొత్తం 6137 మంది రైతులు ఈ క్రాప్ నమోదు చేసుకున్నారన్నారు. వారు తప్పనిసరిగా రైతు భరోసా కేంద్రం నుంచి ధ్రువీకరణ పత్రాలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు వెంకటేశ్వరి, మహేశ్వర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.


ఈక్రాప్ పత్రాలను పంపిణీ చేస్తున్న ఏడీఏ

యువత ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

కడప (మారుతీనగర్), మార్చి 14: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో యువత ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని, దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని స్టెప్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి సాయిగ్రేస్ అన్నారు. యువతలో నాయకత్వ లక్షణాలను వెలికితీసేందుకు నైబర్ హుడ్ యూత్ పార్లమెంటు కార్యక్రమాలు ఎంతగానో దోహదపడగలదన్నారు. భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ నెహ్రూయువకేంద్రం కడప ఆధ్వర్యంలో గురువారం స్థానిక సాయి కృప నర్సింగ్ కాలేజీ ఆడిటోరియంలో జిల్లాస్థాయి నైబర్ హుడ్ యూత్ పార్లమెంటు కార్యక్రమాన్ని నిర్వహించారు. యువత వృత్తిపరమైన విద్యనే కాకుండా చట్టసభల్లో అడుగుపెట్టి చట్టాలను చేయాల్సిన బాధ్యత కూడా ఉందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ జా యింట్ డైరెక్టరు నాగేశ్వర్‌రావు, నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువఅధికారి మణికంఠ, ఆ కళాశాల ప్రిన్సిపల్ విద్యనాగభూషణ్, కళాశాలవిద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సాయి గ్రేస్

మరింత ఆర్థికాభివృద్ధిని సాధించాలి: ఎంపీడీఓ

పులివెందుల రూరల్, మార్చి 14: ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొంటూ మరింత ఆర్థికాభివృద్ధి సాధించాలని ఎంపీడీఓ దివాకర్ మహిళలకు సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ సభాభవనంలో వైఎస్సార్ చేయూత నా లుగో విడత నిధుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ చేయూత లబ్ధిదారులకు జీవనోపాధి మెరుగుదలకు బ్యాంకు లింకేజీ, శ్రీనిధి ఉన్నతి, సామాజిక పెట్టుబడి నిధుల ద్వారా రూ.50వేల నుంచి లక్ష రూపాయల వరకు రుణవసతి కల్పిస్తారన్నారు. అనంతరం మండల వ్యాప్తంగా 882 మందికి మంజూరైన రూ.1.68కోట్ల చెక్కును విడుదల చేశారు. ఎంపీపీ వరలక్ష్మి, ఉప మండలాధ్యక్షుడు విశ్వనాథరెడ్డి, ఏపీఎం కేవీఎస్ గురురాజ్, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీడీఓ దివాకర్

నిర్భయంగా ఓటు వేయాలి

కొండాపురం, మార్చి 14: రాబోయే ఎన్నికలలో ప్రజలు నిర్భయంగా ఓటు వేయాలని కొండాపురం సీఐ వేణుగోపాల్, ఎస్ఐ యోగీంద్రలు తెలిపారు. గురువారం మండలంలోని కొండాపురం, చౌటిపల్లె, తిమ్మాపురం, లావనూరు, పి.అనంతపురం, పొట్టిపాడు, వెంకయ్యకాలువ గ్రామాలలో స్పెషల్‌పార్టీ పోలీసులు(సీఏఎఫ్) ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు. ప్రజలు ఎటువంటి భయభ్రాంతులకు గురికావద్దని తమ ఓటు హక్కును స్వేచ్ఛగా ఉపయోగించుకోవాలని తెలిపారు. ఎవరైనా గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

చికిత్స కోసం రూ.లక్ష చెక్కు అందజేత

కొండాపురం, మార్చి 14: స్థానిక ఎస్టీ కాలనీకి చెందిన ఎరుకల నాగన్న చికిత్స కోసం ట్రైకార్ చైర్మన్ గుండ సురేంద్ర రూ.లక్ష చెక్కును అందజేశారు. నాగన్న గత నెల 27న రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని మెరుగైన చికిత్స కోసం కర్నూల్ ఆసుపత్రికి తరలించారు. పేద కుటుంబానికి చెందిన ఇతనికి చికిత్సకు సహాయం చేయాలని ఏపీ ట్రైబల్‌ఫెడరేషన్ జిల్లా మహిళాధ్యక్షురాలు డేరంగుల జ్యోతి పలువురి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ట్రైకార్ చైర్మన్ కర్నూలు ఆసుపత్రికి వచ్చి వారి కుటుంబ సభ్యులకు చెక్కును అందజేశారు.

ఆహారభద్రత చట్టాన్ని పటిష్టం చేయాలి

కొండాపురం, మార్చి 14: కేంద్రప్రభుత్వం ఆహారభద్రత చట్టాన్ని పటిష్ఠం చేయాలని సీపీఐ, ఏఐటీయూసీ రైతు సంఘాల ఆధ్వర్యంలో గురువారం కొండాపురంలో రాస్తారోకో నిర్వహించారు. రైతులకు రుణమాఫీ చేయాలని, కనీస మద్దతు ధరప్రకటించాలని తదితర డిమాండ్లతో ఢిల్లీలో రైతు సంఘాలు చేపట్టిన ఆందోళనకు మద్దతుగా రాస్తారోకో చేపట్టారు. సీపీఐ మండల కార్యదర్శి మనోహర్‌బాబు, ఏఐటీయూసీ మండల ప్రధాన కార్యదర్శి వెంకటరమణ, మండల రైతు సంఘం అధ్యక్షుడు జయంతు తదితరులు పాల్గొన్నారు.

మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శిగా లక్షుమయ్య

ప్రొద్దుటూరు, మార్చి 14: రాష్ట్ర మాల మహానాడు రాష్ట్ర కార్య దర్శిగా ప్రొద్దుటూరుకు చెందిన సాత్రి లక్షుమయ్య ఎన్నికైనట్లు ప్రకటించారు. మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోర్ల అరుణ్‌కుమార్, రాష్ట్ర అధ్యక్షుడు జాన్ పాల్ ఆధ్వర్యంలో గుంటూరులో జరిగిన రాష్ట్ర మాల మహానాడు సమావేశంలో ఏకగ్రీవంగా ఎంపిక చేశారని తెలిపారు.

ప్రజామద్దతుతోనే టీడీపీ టికెట్టు దక్కింది

టీడీపీ గెలుపు కోసం అందిరిని కలుపుకుని సమన్వయంతో పనిచేస్తా : వరద



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు, మార్చి 14: ప్రొద్దుటూరు ప్రజల మద్దతుతోనే టీడీపీ టికెట్టు దక్కిందని.. ప్రజల నమ్మకాన్ని వమ్ముచేయకుండా టీడీపీ గెలుపు కోసం అందిరినీ కలుపుకుని సమన్వయంతో పనిచేస్తానని మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక నెహ్రూ రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రొద్దుటూరులో టీడీపీ టిక్కెట్టు కోసం గత కొన్ని నెలలుగా తీవ్ర పోటీ నెలకొందన్నారు. ఆశావాహులున్నప్పటికీ సర్వేలలో ప్రొద్దుటూరు ప్రజలు నాకు మద్దతు ఇవ్వడంతో ఎవ్వరి సిఫారస్సులు లేకున్నా పార్టీ అధ్య క్షుడు చంద్రబాబు నాయుడు, జాతీయ కార్యదర్శి లోకేష్ బాబు, రాష్ట్ర అధ్యక్షుడు అచ్చన్నాయుడులు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎంపిక చేశారన్నారు. రెండురోజుల్లో చంద్రబాబు, లోకేష్‌లను కలిసి వచ్చిన అనంతరం స్థానికంగా వున్న ఇన్‌చార్జ్ ప్రవీణ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి, సీఎం సురేష్ నాయుడు, ముక్తియార్, ప్రభాకర్‌రెడ్డిలను కలిసి వారందరితో చర్చించి.. పార్టీ ప్రచారం కలిసి కట్టుగా సాగిస్తామన్నారు. పొత్తులో ఉన్న జనసేన, బీజేపీ నాయకులను కూడా సమన్వయం చేసుకొని ముందుకు సాగుతామన్నారు. వైసీపీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి ప్రొద్దుటూరులో టీడీపీ జెండా ఎగురనీయనని.. సమాధి చేస్తానని చాలా పెద్ద మాటలు మాట్లాడారన్నారు. రాచమల్లు అరాచక, అవినీతి, దౌర్జన్యకర పాలన నుంచి ప్రొద్దుటూరుకు మళ్లీ మంచి రోజులు తీసుకొచ్చేందుకు ప్రజలు నాకు బాధ్యత ఇచ్చారన్నారు. ఆ బాధ్యతను నెరవేర్చేందుకు పొత్తులో వున్న జనసేన, బీజేపీ నేతలతో కలిసి ఇక్కడ ఘన విజయం సాధించి ప్రొద్దుటూరు సీటు చంద్రబాబుకు కానుకగా ఇస్తామన్నారు. నన్ను నమ్మి బలపరుస్తూ నా వెంట నడిచిన అభిమానులు, కార్యకర్తలు, ప్రజలకు ఎప్పటికీ రుణ పడి వుంటానన్నారు. టీడీపీ నాయకుడు నంద్యాల కొండారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ రఘు రామిరెడ్డి, టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు తదిరులు పాల్గొన్నారు.

ఘనంగా జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం





జమ్మలమడుగులో జనసేన నేతలు, అభిమానుల ర్యాలీ, ప్రొద్దటూరులో రక్తదానం చేస్తున్న కార్యకర్తలు

జమ్మలమడుగు, మార్చి 14: జమ్మలమడుగులో జనసేన పార్టీ 11వ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జమ్మలమడుగు పట్టణంలో జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనంతరం అలంకార్ ఫంక్షన్ హాల్‌లో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా జమ్మలమడుగు జనసేన కోఆర్డినేటర్స్ నల్లంశెట్టి నాగార్జున, డేరంగుల జగదీష్ మాట్లాడుతూ ప్రస్తుత ఎన్నికల్లో జనసేన పెట్టుకున్న పొత్తులో భాగంగా ఆ పార్టీ నేతలతో కలసి పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో కొండాపురం, మైలవరం, పెద్దముడియం, ముద్దనూరు, ఎర్రగుంట్ల, మండలాలకు చెందిన జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

మైదుకూరు : జనసేన పార్టీ 11వ వార్షికోత్సవం సందర్భంగా గురు వారం మైదుకూరులో ఆ పార్టీ నాయకులు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన ఆత్మీయ కార్యాలయం నూతనంగా ప్రారంభించి, కేకు కట్ చేసి వేడుకలు నిర్వహించారు. జనసేన నాయకులు రిటైర్డ్ కర్నల్ కందనూరు గోపి, చిలుంగారి కృష్ణమూర్తి, పుల్లయ్య, పాల కొండయ్య, సురేంద్ర, మాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు : ప్రజాసేవలో జనసైనికులు ఎప్పుడు ముందుంటారని ఆ పార్టీ ప్రతినిధులు జిలాన్, సుంకర మురళి, రామారావులు తెలిపారు. గురువారం స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ 11వ ఆవిర్భావం సందర్భంగా కార్యాలయంలో కేక్ కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. జనసైనికులు ఆసుత్రిలో రక్తదాన కార్యక్రమం చేపట్టారు.

ప్రయత్నం చేస్తే ఏదైనా సాధించవచ్చు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

ముద్దనూరు మార్చి 14: క్రమశిక్షణ, లక్ష్యంతో ఏదైనా సాధించవచ్చని జిల్లా సమగ్ర శిక్ష అభియాన్ అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధి గండికోట ప్రాజెక్టు ముంపు గ్రామం కొర్రపాడు గ్రామంలో గురువారం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల నూతన భవనాన్ని ప్రారంభించారు. దాదాపు రూ.1.20 కోట్లతో నిధులతో నూతన పాఠశాల నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం 5గదులను ఏర్పాటు చేశారు. అనంతరం ఉన్నత పాఠశాల పూర్వపు విద్యార్థి విశ్రాంత తెలుగు అధ్యాపకుడు బూచుపల్లి పుల్లారెడ్డిని ఉపాధ్యాయులు ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా దాదాపు రూ.1.50 లక్షలతో పాఠశాల ముందు సరస్వతి విగ్రహం, పీఠం ఏర్పాటుకు తన వంతు సహాయ, సహకారం అందిస్తానని పుల్లారెడ్డి హామీ ఇచ్చారు. ఏపీవో రజనీకాంత్‌రెడ్డి, ఎంఈవోలు నాగేశ్వరనాయక్, రామయ్య, ఓబులేసు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయం ప్రారంభం

- హాజరు కాని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి
- బయట పడిన విభేదాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అవినాశ్‌రెడ్డి

కాశినాయన మార్చి 14: మండలంలోని కొండ్రాజుపల్లెలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాల సముదాయాన్ని గురువారం ఎంపీ అవినాశ్‌రెడ్డి, ఎమ్మెల్యే సుధా బద్వేల్ వైసీపీ సమన్వయకర్త ఎన్.విశ్వనాద్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. సొంత మండలంలోని కొండ్రాజుపల్లె గ్రామ సచివాలయ ప్రారంభోత్సవానికి ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి హాజరు కాకపోవడం, అంతకు ముందు తెల్లపాడువద్ద తడుకుచెరువు ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవానికి ఎంపీ వెంట వచ్చిన ఎమ్మెల్సీ కుమారుడు ఆదిత్యరెడ్డి కూడా అక్కడ నుండే వెనుదిరిగిపోవడం సమావేశంలో చర్చనీయాంశంగా మారింది. దీంతో మరోమారు విశ్వనాథ్‌రెడ్డి ఎమ్మెల్సీ మధ్య విభేదాలు బహిర్గతమయ్యాయి. కార్యక్రమంలో కడప, రాజంపేట రీజనల్ కోఆర్డినేటర్ సురేష్‌బాబు, బద్వేల్ తాలూకా అడ్వైజర్ నిమ్మకాయల సుధాకర్, పీఆర్ అండ్ ఆర్డీ అడ్వైజర్ నాగార్జునరెడ్డి, ఎండీవో మధుసూదన్‌రెడ్డి, ఎంపీపీ పోలమ్మ తదితరులు పాల్గొన్నారు.

బీసీ బాలుర వసతి గృహం తనిఖీ



వసతిగృహంలో తనిఖీ చేస్తున్న బ్రహ్మయ్య

బద్వేలు, మార్చి 14 : పట్టణంలోని ప్రభుత్వ బీసీ బాలుర వసతిగృహాన్ని గురువారం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ సాధికారిక అధికారి డాక్టర్ బ్రహ్మయ్య ఆకస్మిక తనిఖీ చేపట్టారు. వసతి గృహంలో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందుతుందా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అలాగే వసతిగృహా ఆవరణలో పరిసరాలు పరిశుభ్రతతో పాటు విద్యార్థులకు అందించే ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. అనంతరం 10వ తరగతి విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి వసతి గృహానికి తల్లిదండ్రులు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో వసతిగృహ సంక్షేమ అధికారి నాగదాసరి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రైతు వ్యతిరేక చట్టాలు రద్దు చేయాలి



ఆర్డీవోకు వినతి పత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

జమ్మలమడుగు, మార్చి 14: రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని జమ్మలమడుగులో సీఐటీయూ నాయకులు ఆందోళన చేపట్టారు. గురువారం రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని కోరుతూ ఢిల్లీలో జరుగుతున్న ఆందోళనకు మద్దతులో భాగంగా ఆర్డీవో శ్రీనివాసులుకు వారు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులను ఇబ్బంది కలిగించకుండా ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు దాసరి విజయ్, రమేష్, వినయ్‌కుమార్, నరేంద్ర, దస్తగిరి, తదితరులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల : రైతులకు వ్యతిరేకంగా ఉన్న మూడు చట్టాలను ప్రభు త్వం వెంటనే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు భైరవ ప్రసాద్ అన్నారు. గురువారం పోస్టాఫీసు ఎదుట సీఐటీయూ ఆధ్వ ర్యంలో ధర్నా చేశారు. అనంతరం పోస్టల్ అధికారికి వినతిపత్రం అందిం చారు. సీఐటీయూ నాయకులు రత్నం, ఐద్వా సంఘం జిల్లా ఉపాధ్యక్షు రాలు గౌసియాబేగం పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు

ఖాజీపేట, మార్చి 14: మండల పరిధిలోని పత్తూరు మెయిన్‌లో సీతారామ లక్ష్మణ, హనుమంత విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ చేయనున్నారు. భక్తులకు వినోదం కోసం కోలాటం, పాటకచ్చేరి ఏర్పాటు చేయడంతో పాటు మూడు రోజులు భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమం కూడా చేపట్టనున్నట్లు ఆలయ కమిటీ తెలిపారు. స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు లేకుండా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

'ముఖ్యమంత్రి పదవి కోసం శవం పక్కనే సంతకాలు చేయించిన చరిత్ర జగన్‌ది'

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 14: తండ్రి శవం పక్కన పెట్టుకుని ముఖ్యమంత్రి పదవి కోసం ఎమ్మెల్యేలతో సంతకాలు చేయించిన చరిత్ర జగన్‌మోహన్‌రెడ్డిదనే విషయం మరచిపోయి ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీపై విమర్శలు చేయడం తగదని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీఎండీ నజీర్ ఘాటుగా విమర్శించారు. గురువారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రాన్ని అడ్డగోలుగా విభజించిందని ఎమ్మెల్యే విమర్శించడం దారుణమన్నారు. రాష్ట విభజనకు తెలుగుదేశం, బీజేపీలతోపాటు వైసీపీ మద్దతు ఇచ్చిన విషయాన్ని ఎమ్మెల్యే గుర్తు పెట్టుకోవాలన్నారు. వైఎస్ ఆశయ సాధనకోసం షర్మిల కాంగ్రెస్ పార్టీలో చేరడంతో భయపడిన వైసీపీ నాయకులు కాంగ్రెస్ పార్టీని లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌పార్టీ పట్టణాధ్యక్షుడు జిలానీబాషా, యూత్‌కాంగ్రెస్ అధ్యక్షుడు వంశీకృష్ణయాదవ్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతస్థానానికి చేరుకోవాలి

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 14: విద్యార్థులు మంచి విద్యను అభ్యసించి సమాజంలో ఉన్నత స్థానానికి చేరుకోవాలని దొరసానిపల్లె జడ్పీ హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు సి.కొండారెడ్డి పేర్కొన్నారు. విశ్రాంత ఉపాధ్యాయుడు చిత్రాల శ్రీనివాసులు పాఠశాలలోని 123 మంది 10వ తరగతి విద్యార్థులకు ఉచితంగా పరీక్ష సామాగ్రిని అందజేశారు. పాఠశాల ఉపాధ్యాయులు సంజీవరెడ్డి, లక్ష్మిరెడ్డి, సంజీవరెడ్డి, బయారెడ్డి పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో పిల్లల్లో ఎదుగుదల

జమ్మలమడుగు, మార్చి 14: పౌష్టికాహారం పిల్లలు ఎదిగేందుకు దోహదపడుతుందని.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రవేశ పెట్టిన పోషణ పక్వాడా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ గౌషియా పేర్కొన్నారు. గురువారం జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని దుత్తలూరు నగర్ అంగన్వాడీ కేంద్రంలో కేంద్రప్రభుత్వం ప్రవేశ పెట్టిన పోషణ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల హెడ్మాస్టర్ కె.రమేష్, అంగన్వాడీ కార్యకర్త ముంతాజ్‌బేగం పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

బద్వేలు టౌన్, మార్చి 14: మండల పరిధిలోని నందిపల్లె బ్రిడ్జి వద్ద గురువారం రాత్రి కారు, ద్విచక్ర వాహనంలో ఢీకొన్న సంఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. తొట్టిగారిపల్లెకు చెందిన వెంకటసుబ్బయ్య (35) అనే వ్యక్తి సొంత పని నిమిత్తం ద్విచక్రవాహనంలో నందిపల్లెకు వెళ్లాడు. అక్కడ పని ముగించుకుని తిరిగి స్వగ్రామం వస్తుండగా వెనుక నుంచి వస్తున్న కారు ఢీకొంది. దీంతో అతనికి కాలు విరిగి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు బద్వేలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా.. ప్రథమ చికిత్స అనంతరం కడప రిమ్స్‌కు తరలించారు.

తాగునీటి కోసం మహిళల ధర్నా

మైదుకూరు, మార్చి 14 : మైదుకూరు పట్టణంలోని తాగునీటి ఎద్దడి నెలకొంది. పాతపాళెంకు చెందిన మహిళలు బిందెలు తీసుకొని ట్రాక్టర్‌పై స్థానిక మున్సిపల్ కార్యాలయానికి చేరుకొని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూగర్భజలాలు ఇంకి పోవడంతో బోరు మోటరు వేసినా నీళ్లు రావడం లేదని, అధికారులు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు అధికారులకు వినతి పత్రం అందజేశారు.

ఘనంగా కార్ల్‌మార్క్స్ 142వ వర్ధంతి

బద్వేలు, మార్చి 14 : పట్టణంలోని సుందరయ్య భవనంలో కార్ల్‌మార్క్స్ 142వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి సీపీఎం పట్టణనాయకులు చిన్ని మాట్లాడుతూ కార్ల్‌మార్క్స్ ప్రపంచ కార్మిక వర్గానికి దిశా నిర్దేశం చేసిన గొప్పవ్యక్తి అని కొనియాడారు.

కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారి విధానాలను వేగవంతం చేస్తోందని.. దీనికి వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సీపీఎం నాయకులు కొండయ్య, నాగార్జున, గుర్రయ్య, ఆంజనేయులు పాల్గొన్నారు.

టీడీపీ విజయాన్ని ఎవ్వరూ అడ్డుకోలేరు



ప్రచారంలో పాలొన్న సీఎం సురేష్‌నాయుడు, లింగారెడ్డి, ముక్తియార్‌లు

ప్రొద్దుటూరు, మార్చి 14: రాష్ట్రంలో ఎన్ని సిద్ధం సభలు పెట్టినా.. ప్రజలను ఎంత మభ్య పెట్టినా.. టీడీపీ విజయాన్ని ఎవ్వరూ అడ్డుకోలేరని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు సీఎం సురేష్ నాయుడు, మాజీ ఎమ్మెల్యే మల్లెల లింగారెడ్డిలు పేర్కొన్నారు. గురువారం స్థానిక ఆర్ట్స్‌కాలేజీ రోడ్డులో బాబూ ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా బాబు ఆరుగ్యారెంటీల కరపత్రాలను పంపిణీ చేశారు. మాజీ మున్సిపల్ ఇన్‌చార్జ్ చైర్మన్ వీఎస్ ముక్తియార్, ఈవీ సుధాకర్‌రెడ్డి, ఖలీల్, నల్లబోతుల నాగరాజు, నిజాం డాక్టర్ గౌస్‌సాదక్, నీలాపురం బాషా, జనసేన రఫీ తదితరులు పాల్గొన్నారు.

చిన్నశెట్టిపల్లెలో ఉత్సవ విగ్రహాల ఊరేగింపు



రాజుపాలెం, మార్చి 14: మండల పరిధిలోని చిన్న శెట్టిపల్లె రామలింగేశ్వర దేవస్థానంలో నూతనంగా ప్రతిష్ఠించనున్న సుబ్రమణ్యేశ్వర, నవగ్రహ, నాగ, సాయి బాబ శిఖర ఉత్సవ విగ్రహాలను వైభవంగా ఊరేగించారు. మహిళలు ఉత్సవ విగ్రహాలకు కాయ కర్పూరం సమర్పించారు. అనంతరం ఆలయంలో కలశాలు ఏర్పాటు చేసి వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య జలాధివాసం, మృత్యుం గ్రహణం, అగ్ని ప్రతిష్ఠ, అంకురారోహణం, కుంకుమార్చనలు, గణపతి హోమం, దీక్షా హోమం, నవగ్రహ హోమం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అక్కడ పూజా కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీ మెట్టుపల్లి లక్ష్మిదేవి భర్త జయంత్ రెడ్డి పాల్గొన్నారు.

శాంతిని కాంక్షించిన శాస్త్రవేత్త ఐన్‌స్టీన్

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 14: ప్రపంచశాంతిని ఆకాంక్షించిన ప్రగతిశీల శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ అని జేవీవీ రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, జిల్లా అధ్యక్షుడు పొలంకి శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం ఆల్‌బర్ట్ ఐన్‌స్టీన్ జయంతిని గౌతమ్ హైస్కూలు, గోపీకృష్ణ హైస్కూలులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐన్‌స్టీన్ బాల్యం నుంచి శాస్త్ర విజ్ఞానంపై ఇష్టాన్ని పెంచుకుని భౌతిక శాస్త్రంలో అసాధరమైన ప్రతిభ కనపరిచారని పేర్కొన్నారు. ఆయన కృషి వలనే నేడు మనం ఉపయోగిస్తున్న టీవీ, జీపీఎస్, అణువిద్యుత్తు కేంద్రాలు, అంతరిక్షయానం, లేజర్, డీవీడీ ప్లేయర్లు అందుబాటులోకి వచ్చాన్నారు. రెండవ ప్రపంచ యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ ఆయన జర్మనీ నుండి అమెరికాకు వలస వెళ్లారని పేర్కొన్నారు. జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలబయన్న, కిరణ్, ప్రియాంక, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే రాచమల్లు చెప్పేవన్నీ అబద్ధాలే'



మాట్లాడుతున్న కొత్తపల్లె వైసీపీ సర్పంచ్ శివచంద్రారెడ్డి

ప్రొద్దుటూరు, మార్చి 14: ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి చెప్పేవన్నీ అబద్ధాలేనని.. సొంత నిధులు రూ.3.5 కోట్లతో ప్రకాష్‌నగర్ అభివృద్ధి చేస్తానని చెప్పి.. పైసా ఇవ్వకుండా ఎంపీ నిధులతో పనిచేసి.. పైగా ప్రతి చోట సొంత నిధులతో చేస్తున్నట్లు ప్రజలను మభ్యపెడుతున్నాడని కొత్తపల్లె వైసీపీ సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి విమర్శించారు. గురువారం ఆయన కొత్తపల్లె పంచాయతీ కార్యాలయంలో మాట్లాడుతూ పంచాయతీలో వున్న జనరల్ ఫండ్‌ను రూ.4 కోట్ల మేర ఎమ్మెల్యే కోరిక మేరకు ఖర్చు పెట్టామన్నారు. ఇప్పటి వరకు ఎవ్వరూ పంచాయతీని అభివృద్ధి చేయనట్లు, ఎమ్మెల్యే రాచమల్లు మాత్రమే సొంత నిధులతో అభివృద్ధి చేస్తున్నట్లు అవాస్తవాలు ప్రచారం చేస్తున్నాడన్నారు. పంచాయతీలో నిధులు లేకున్నా ప్రకాష్‌నగర్ అభివృద్ధి కోసమని రూ.50 లక్షల నిధులు మంజూరుకు తీర్మానం చేయాలని ఎమ్మెల్యే పంచాయతీ సమావేశం పెట్టించారన్నారు. పంచాయితీ కార్యదర్శి నిధులు లేవని తీర్మానం చేయలేమని తెలపడంతో సమావేశం వాయిదా పడిందన్నారు. సొంత నిధులతో అభివృద్ధి చేస్తానని ప్రకటించే ఎమ్మెల్యే ప్రతిసారి పంచాయితీ నిధులు ఎందుకు కావాలని కోరుతున్నారన్నారు. ఆటోనగర్, వివేకానందనగర్, ప్రకాష్ నగర్‌లో మా అన్న సర్పంచ్ ఉన్న కాలం నుంచి ఎంవీఆర్ వాళ్లు వున్న కాలం నుంచి నావరకు అందరం అభివృద్ధి చేస్తుంటే.. మేమెవ్వరం అభివృద్ధి చేయలేదని.. ఆయనే అభివృద్ధి చేసినట్లు ప్రజలను మభ్య పెట్టేందుకు యత్నిస్తున్నాడన్నారు. ఎమ్మెల్యే రాచమల్లు ఇకనైనా అవాస్తవాలు ప్రచారం చేయడం మానుకుని ఎన్నికలలో ప్రజలను ఓట్లడగాలన్నారు.

ఐసీడీఎస్ అధికారుల చేతివాటంపై చర్యలు తీసుకోవాలి

జమ్మలమడుగు, మార్చి 14: ఐసీడీఎస్ అధికారులు చేతివాటం ప్రదర్శిస్తున్నారని, కమీషన్ల కకుర్తికోసం వస్తువులు కొనుగోలు చేస్తున్నారని విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సీపీఐ పట్టణ కార్యదర్శి ప్రసాద్ డిమాండ్ చేశారు.

గురువారం ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాలకు నిధులు మంజూరు చేసి కార్యకర్త అకౌంట్లలో జమ చేసిందని, ఆ నిధులతో అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు అవసరమైన ప్లేట్లు, గ్లాసులు, పలకలు కొనుగోలు చేసి వినియోగించాల్సి ఉందన్నారు. అలాగే అంగన్వాడీ కేంద్రాల్లో చిన్న చిన్న మరమ్మతులకు నిధులు మంజూరు చేశారని, ఆ డబ్బులను సంబంధిత అధికారులు చేతివాటం ప్రదర్శించి తీసుకుంటున్నట్లు ఆయన ఆరోపించారు. అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.